
నోట్ల తోరణం.. అమ్మ వైభవం

రూ.3.33 కోట్లతో వాసవీమాతకు అలంకరణ



విలువల మెరిసే కొత్త కరెన్సీ కట్టలు.. తళతళలాడే నాణేలు.. ఎటు చూసినా లక్ష్మీ కళ. దసరా మహోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని వాసవీమాతకు మంగళవారం రూ. 3.33 కోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం, ఆలయ ప్రాంగణాన్ని నోట్లు, నాణేలతో నింపేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అయోధ్య కోదండరామునికి సమర్పించే రామబాణం కూడా భక్తుల దర్శనం కోసం అక్కడ ఉంచారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

దుర్గమ్మకు అన్నవరం దేవస్థానం పట్టు వస్త్రాలు

దసరా మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారికి అన్నవరం దేవస్థానం నుంచి మంగళవారం పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ, పండ్లు అందజేశారు. ఛైర్మన్ ఐ.వి. రోహిత్, ఈవో కె.రామచంద్రమోహన్‌లు కుటుంబసమేతంగా విజయవాడ వెళ్లి వీటిని సమర్పించారు.
-న్యూస్‌టుడే, అన్నవరం



పట్టువస్త్రాలతో వస్తున్న అన్నవరం దేవస్థానం ఛైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్ తదితరులు

రివ్వున ఎగురుతూ స్వస్థలాలకు!

దసరా సమీపించింది. పిల్లలకు వారం, పది రోజులు సెలవులు ఇవ్వడంతో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి స్వస్థలాలకు గోదారోళ్లు వచ్చేస్తున్నారు. బస్సు, రైలుతో పాటు ఆకాశయానం ద్వారా వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది.

ఉమ్మడి ఉభయ గోదావరివాసుల రాకపోకల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు మొత్తం 20 విమాన సర్వీసులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్నవన్నీ ఏటీఆర్ సర్వీసులు కావడంతో ఒక్కోదాంట్లో 72 మంది ప్రయాణించే సామర్థ్యం ఉంది. రోజూ 1,100 మందితో 70 శాతం ఆక్యుపెన్సీ నమోదవుతుంది. దసరా నేపథ్యంలో ఇది కాస్తా 1,400 వరకు ఉంటోంది. పూర్తిస్థాయిలో నిండుకుంటున్నాయి.

■ హైదరాబాద్‌కు డిమాండ్

గోదావరి జిల్లాలకు చెందిన వ్యాపార, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హైదరాబాద్ కేంద్రంగా వచ్చి వెళుతుంటారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ ఒక్క నగరానికే ఇండిగో విమానయాన సంస్థ ఏకంగా 14 సర్వీసులను నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మూడు నగరాలకు కలిపి 1.80 లక్షల మంది ప్రయాణిస్తే అందులో సుమారు 1.27 లక్షల మంది హైదరాబాద్‌కు ప్రయాణించారు.



■ రెట్టింపైన టికెట్ ధరలు

నెల రోజుల ముందు నుంచే విమాన టికెట్ల బుకింగ్ వేగం పుంజుకుంది. ఇప్పటికే 80 శాతానికి పైగా విక్రయాలు జరిగాయని సమాచారం. ప్రయాణికుల రాకపోకలు పెరిగే అవకాశం ఉండటంతో టికెట్ల విక్రయం పెరిగితే సాధారణంగా రూ.5 వేలు ఉండే ధర అమాంతం రూ.10 వేలు దాటుతోంది.

తగినన్ని లేక..

దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లినవారు రాకపోకలు సాగించేందుకు. అలానే పర్వదినాల్లో వచ్చేవారు కోరుకున్న సర్వీసులు తగినన్ని అందుబాటులో లేవు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు దిల్లీకి డిమాండ్ ఉంది. దుబాయ్, లండన్ ఇతర దేశాలకు కనెక్టివిటీ మీద గోదావరి, కోనసీమ జిల్లాలకు చెందిన కొందరు వచ్చి వెళుతున్నారు. దిల్లీ, ముంబయి వంటి ప్రధాన నగరాలకు నేరుగా విమానాలు లేక ప్రాంతాల వారీగా పలు సర్వీసులు మారడంతో టిక్కెట్ల ధర భారమవుతోంది. రాజమహేంద్రవరం విమానాశ్రయ డైరెక్టరు ఎస్.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ రోజుల కన్నా దసరా రోజుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందన్నారు. టికెట్ల డిమాండ్ రోజులను బట్టి మారుతుందన్నారు.

మరో రెండు ప్రత్యేక రైళ్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దసరా నేపథ్యంలో ఈ నెల 18 వరకు మరో రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు(07215) ప్రత్యేక రైలు ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో నడుస్తుంది. ఇది రాత్రి 8 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కు శ్రీకాకుళం చేరుకుంటుంది. శ్రీకాకుళం రోడ్డు-విజయవాడ(07216) రైలు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో నడుస్తుంది. ఇది శ్రీకాకుళంలో ఉదయం 6.30కు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ వస్తుంది. ఈ రైళ్లు ఉమ్మడి జిల్లాలో నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వే స్టేషన్లలో ఆగుతాయన్నారు.

సినిమా చెట్టు.. చిగురించేట్టు

కుమారదేవం నిద్రగన్నేరు పునరుజ్జీవం

కొవ్వూరు పట్టణం, చాగల్లు, న్యూస్‌టుడే: ఎన్నో ప్రకృతి విపత్తులను తట్టుకొని, సుమారు 300 సినిమాల చిత్రీకరణకు వేదికైన 150 ఏళ్ల ఆ వృక్షం నేలకూలగానే తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉన్నవారు విలవిల్లాడిపోయారు. ప్రస్తుతం ఇది వివిధ చికిత్సల ఫలితంగా పునరుజ్జీవం పోసుకుంటోంది. కొవ్వూరు మండలం కుమారదేవంలోని ఈ సినిమా చెట్టు(నిద్రగన్నేరు) వేరు నుంచి రెండుగా చీలిపోయి ఆగస్టు 5న భారీ వర్షాలు, వరదలకు గోదావరిలో పడిపోయింది. రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్స్ స్పందించి చెట్టును బతికించేందుకు చర్యలు చేపట్టింది. అదే నెల 8న వేర్లు, కొమ్మలు కత్తిరించి పలు రసాయన మిశ్రమాలను అద్దారు. అవి పూసిన చోట గాలి, ధూళి తగలకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కాండం, కొమ్మల భాగాల్లో సుమారు పది చోట్ల పచ్చని ఆకులతో చిగుళ్లు వచ్చాయి. మరో నెల రోజుల్లో ఏపుగా పెరిగే పరిస్థితి ఉంది.



చెట్టు కాండంలో వచ్చిన చిగుళ్లు




చిగురించిన పచ్చదనాన్ని చూపిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధి దుర్గాప్రసాద్

అవాంతరాలు ఎదురైనా..

రోటరీ క్లబ్ గ్రీన్ భారత్, వనం-మనం విభాగం ద్వారా చెట్టు ప్రాజెక్టు ఛైర్మన్ రేఖపల్లి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో రెండు నెలలుగా ఈ కార్యాచరణ నడుస్తోంది. చెట్టు ఉన్న ప్రదేశం కొద్దికొద్దిగా కోతకు గురవడం.. వర్షాలతో పనులకు ఆటంకం కలిగింది. గత 10 రోజులుగా రెండు, మూడు సార్లు చిగుళ్లు వచ్చినా ఎలుకలు తినేయడంతో ఇబ్బందులు తప్పలేదు. ముగ్గురు వ్యక్తులు నిత్యం పర్యవేక్షిస్తూ రసాయనాలు అందిస్తూ శ్రద్ధ కనబరిచారు. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి కొమ్మలుగా విస్తరించి పదిమంది సేద తీరే స్థాయికి వస్తుందని చెబుతున్నారు.

నిధులు పారితే.. ప్రగతి అఖండమే

- ■ రూ.100 కోట్లతో గోదావరి తీరం అభివృద్ధికి నివేదిక
- ■ 15న కేంద్రానికి అందించనున్న పర్యాటకశాఖ



ఈనాడు, కాకినాడ

గోదావరి పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రగతి ఫలాలు అందుబాటులోకి తేవాలన్నది పర్యాటక శాఖ ప్రణాళిక. ఈ మేరకు రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర పథక నివేదిక (డీపీఆర్)ను ఈనెల 15న కేంద్రానికి సమర్పించనుంది. ఈ నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు ఫెసిలిటేటర్స్ -కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఏపీపీఎఫ్‌సీఎస్) ప్రతినిధులు సిద్ధంచేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక ప్రగతి పనులకు సంబంధించి గతనెల 21న సాంకేతిక నిపుణుల బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, ఆకృతులపై ఓ స్పష్టతకు వచ్చింది. సమాచారం, మ్యాపులు సేకరించారు. గుర్తించిన పనుల్లో సాధ్యాసాధ్యాలపై కసరత్తుచేసి ఒక అంచనాకు వచ్చారు.

- ● రాష్ట్రంలో అఖండ గోదావరి, సంగమేశ్వరం, శ్రీశైలం, సూర్యలంక ప్రాజెక్టులకు సమగ్ర పథక నివేదికలు సిద్ధమయ్యాయి. పర్యాటక శాఖ ప్రతిపాదనలు పంపిన అనంతరం నిధుల మంజూరుపై కేంద్రం నిర్ణయం తీసుకోనుంది.
- ● రాష్ట్రంలో రెండు ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.200 కోట్ల మంజూరుకు అవకాశం ఉంది. 2027లో గోదావరి పుష్కరాలూ ఉన్నందున అఖండ గోదావరికి రూ.100 కోట్లు వస్తాయన్న ధీమా పర్యాటక శాఖ వ్యక్తం చేస్తోంది.

రూ.వెయ్యి కోట్లతో ప్రణాళిక

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.వెయ్యి కోట్లతో గోదావరి తీరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళిక ఉంది. అఖండ గోదావరిలో భాగంగా తీరం అభివృద్ధి, విహారానికి బోట్లు ఇతరత్రా చర్యలు పర్యాటక శాఖ పర్యవేక్షణలో చేపట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి పడవల్లో బ్రిడ్జిలంక వెళ్లి అడ్వెంచర్ గేమ్స్‌ను ఆస్వాదించి.. అక్కడ్నుంచి హేవలాక్ వంతెన వద్దకు వెళ్లి.. అక్కడి 18 స్పాన్లు మీదుగా రాజమహేంద్రవరం వచ్చేలా అభివృద్ధిచేయాలన్న ప్రతిపాదన ఉంది. ఇక్కడ బంగీజంప్‌తోపాటు పర్యాటకులకు ఆటవిడుపు, దుకాణాలు, ఇతరత్రా ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో ఏ ప్రణాళికలకు ఆమోదం దక్కుతుందన్నది కొద్దిరోజుల్లో స్పష్టత రానుంది.

డీఎఫ్‌వో బాధ్యతల స్వీకరణ

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ అటవీ శాఖ అధికారిగా డి.రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం డీఎఫ్‌వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీ సత్యసాయి జిల్లా డీఎఫ్‌వోగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకూ రాయలసీమ ప్రాంతంలో పనిచేశానని, వర్షపాతం తక్కువగా ఉండటంతో మొక్కల సంరక్షణ కష్టతరమన్నారు. కాకినాడ జిల్లాలో పచ్చదనం ఎక్కువగా ఉంటుందని, అటవీ భూములను కాపాడతామన్నారు. మడ అడవులను సంరక్షిస్తామన్నారు.



రవీంద్రనాథ్‌రెడ్డి

10న వికాస కార్యాలయంలో ఉద్యోగ మేళా

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో 10న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిరామ్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు చెప్పారు. బీఎస్సీ, బీకాం, బీటెక్ (2012నుంచి 2021 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన), ఎంబీఏ, ఎంసీఏ (2012 నుంచి 2022 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన) అభ్యర్థులు అర్హులన్నారు. సీసీ++, జావా, పైథాన్, సేల్స్ ఫోర్స్, అడ్మిన్, ఎల్‌డబ్ల్యూసీ ఇంటర్‌గ్రేషన్, మైక్రోసాఫ్ట్ డైనమిక్స్ 365, సీఎంఆర్, సీఈ కోర్సుల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు గురువారం ఉదయం 9 గంటలకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

టెట్‌కు 1,557 మంది హాజరు

కాకినాడ నగరం: జిల్లాలో మంగళవారం జరిగిన టెట్ పరీక్షకు 1,557 మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 1,781 మంది హాజరు కావాల్సి ఉండగా 224 మంది గైర్హాజరయ్యారు. కాకినాడ నగరంలో ఎస్.అచ్యుతాపురం ఐయాన్ డిజిటల్స్, కాకినాడ గ్రామీణం రాయుడుపాలెం సాఫ్ట్ టెక్నాలజీస్, సూరంపాలెం ఇంజినీరింగు కళాశాలలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు జరిగినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

పిఠాపురం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఆయన దస్త్రాలు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ ఘటనల కేసులపై ఆరా తీశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మణికుమార్‌కు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు, శాంతిభద్రతలు, గంజాయి నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. కాకినాడ, పిఠాపురంలలో గంజాయి బీట్ ప్రత్యేకంగా నిర్వహిస్తామన్నారు. రైల్వేట్రాక్‌లు, ఆర్‌వో ప్రాంతాల వద్ద అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆయనతో పాటు సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

అన్నదాతలకు అండగా 'కూటమి' అడుగు

మొత్తం ధాన్యం కొనుగోలుకు సిద్ధం



పెదపూడి మండలంలో ధాన్యం సేకరణ (పాత చిత్రం)

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్‌లో ఉత్పత్తి అయ్యే మొత్తం ధాన్యం సేకరించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వరదలు, భారీ వర్షాలతో అన్నదాతలు కొంతమేర నష్టపోయిన నేపథ్యంలో రైతుసేవా కేంద్రాల ద్వారా ఎంత ధాన్యమైనా సేకరించేందుకు సిద్ధమవుతోంది. కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన ఇటీవల నిర్వహించిన ధాన్యం సేకరణ సమావేశంలో ఖరీఫ్‌లో 2.78 లక్షల టన్నులు మాత్రమే సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. మొత్తం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు కొని, రైతు ఖాతాకు 48 గంటల్లో సొమ్ము జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులొచ్చాయి. దీంతో పౌరసరఫరాల కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ రాహుల్ మీనా అధ్యక్షతన జిల్లాస్థాయి ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. మొత్తం ధాన్యాన్ని కొనాలని నిర్ణయం తీసుకున్నారు. సేకరించిన ధాన్యాన్ని మరపట్టించి, సీఎంఆర్ కింద పౌరసరఫరాల సంస్థకు ఇచ్చేందుకు మిల్లర్లు ముందుకొచ్చారు. దీంతో పాటు ప్రభుత్వం తీసుకున్న మరో నిర్ణయం కూడా రైతులకు వరంగా మారనుంది. ఇన్నాళ్లు సీఎంఆర్ రైస్‌మిల్లులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించేవారు. దీంతో కల్లాలకు దూరంగా ఉన్న మిల్లులకు ధాన్యాన్ని తరలించాల్సి వచ్చేది. ఈ విధానానికి స్వస్తి పలికి రైతు సూచించిన మిల్లుకే ధాన్యాన్ని తరలించేలా ఉత్తర్వులిచ్చారు. మొత్తంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తి అయ్యే ధాన్యాన్ని ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనడంతో ఎంతో మేలు జరగనుంది.

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం ఉత్పత్తి అంచనా: 5.45 లక్షల టన్నులు		
ధాన్యం సేకరణ లక్ష్యం: 4.35 లక్షల టన్నులు	రైతుల వినియోగం: 1.10 లక్షల టన్నులు	
కొనుగోలు కేంద్రాలు: 276	సీఎంఆర్ మిల్లులు: 116	సేకరణ సిబ్బంది (టీఏ, డీఈవో, హెల్పర్స్): 828
ధాన్యం తరలింపునకు సిద్ధం చేసిన వాహనాలు: 1,700		
అందుబాటులోని తేమ యంత్రాలు: 414	సిద్ధం చేసిన వేబ్రిడ్జిలు: 138	
సిద్ధం చేసిన గోనె సంచులు: 20లక్షలు		
క్వింటా ధాన్యం(గ్రేడ్-ఏ) కనీస మద్దతు ధర: 2,320	క్వింటా ధాన్యం (సాధారణ) కనీస మద్దతు ధర: 2,300	
జిల్లాస్థాయి కంట్రోల్ రూం నంబరు 88869 03611		

వారంలో శిక్షణ..

ఈనెలాఖరుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. వారంలో సిబ్బందికి శిక్షణ ఇస్తాం. నవంబరు మొదటి వారం నుంచి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నాం. కస్టోడియన్ అధికారులను నియమించాం. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తాం. దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దు. కనీస మద్దతు ధరకు ఎక్కువిస్తే విక్రయించవచ్చు. 48 గంటల్లో సొమ్ము జమ చేస్తాం.
- ఎం.దేవులనాయక్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు, కాకినాడ



'పల్లె పండుగ'తో అభివృద్ధి పనులు

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో ఈనెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం అమరావతి నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి దూరదృశ్య సమావేశం నిర్వహించారు. పల్లె పండుగపై చర్చించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఆగస్టు 23న జిల్లాలోని 385 పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో అభివృద్ధి పనులకు చేసిన తీర్మానాల్లో 70 శాతం మంజూరు చేశామన్నారు. గిరిజన ప్రాంతాల్లో బీటీ రోడ్లు, మిగతా గ్రామాల్లో సీసీ రోడ్డు కం డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడతామన్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన అర్జీల ఆధారంగా పనులు మంజూరు చేశామన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీవో రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ మల్లికార్జున్, డీఎల్‌డీవో వాసుదేవర తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎన్నికలకు ఓటర్ల జాబితా విడుదల

మసీదు సెంటర్ (కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను జీజీహెచ్‌లో ఎన్నికల అధికారి టి.నందన మంగళవారం విడుదల చేశారు. ఎన్నికల నిమిత్తం కోపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న టి.నందన ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. జాబితాలో మొత్తం 247 ఓట్లు ఉన్నాయన్నారు. జాబితాలో అభ్యంతరాలుంటే 13లోగా తెలియజేయాలన్నారు. 14న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 16న ఉదయం 10 నుంచి సాయంత్రం 4లోగా నామపత్రాలు స్వీకరిస్తామన్నారు. 17న పరిశీలిస్తామన్నారు. 18లో ఉపసంహరించుకోవాలన్నారు. 23న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారితో పాటు సభ్యుల కోసం ఎన్నికలు జరుగుతాయన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

కాకినాడ కలెక్టరేట్: సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కావాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టర్లు, జేసీలతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ రాహుల్‌మీనా, అధికారులు హాజరయ్యారు. ఎన్నికలు, కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, గేట్లు, గట్ల బలోపేతం వంటి అంశాలపై సమీక్షించారు. ఆపై కలెక్టర్ మాట్లాడుతూ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలోకి కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి రైతుల పేర్లతో ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. డీఆర్వో డి.తిప్పేనాయక్, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల కాలువ



కాకినాడ గ్రామీణ మండలం నగరం మీదుగా ఉప్పుటేరులో కలిసే ప్రధాన పంట కాలువలు డంపింగ్ ప్రదేశాలను తలపిస్తున్నాయి. కాకినాడ ఇంద్రపాలెం వంతెన సమీపంలోని గోదావరి కాలువ, సర్పవరం మీదుగా మరొక కాలువల్లో ఇష్టానుసారంగా వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో అవి రూపును కోల్పోతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు చెత్త వేయడంతో కాలువలు కుంచించుకుపోయి, ప్రవాహం ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొంది. వర్షం పడితే ఆ నీరు జనావాసాల్లోకి వచ్చేస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి, కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.
- ఈనాడు, కాకినాడ

నలుగురు కస్టమ్స్ అధికారుల బదిలీ

అవినీతి ఆరోపణల నేపథ్యంలో చర్యలు

ఈనాడు, కాకినాడ: లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన, పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకినాడ పోర్టులోని కస్టమ్స్ కార్యాలయ ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, సూపరింటెండెంట్ వై.శ్రీనివాసులును బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీరితోపాటు మరో ఇద్దరు సూపరింటెండెంట్లు ప్రదీప్‌కుమార్, ఇ.శ్రీనివాస్‌లను బదిలీ చేశారు. ఈ నలుగురినీ కాకినాడలోని కస్టమ్స్ హౌస్ నుంచి తక్షణమే రిలీవ్ చేసి, విజయవాడలోని కస్టమ్స్ కేంద్ర కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 5న కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలో సీబీఐ అధికారులు దాడిచేసి సూపరింటెండెంట్ వై.శ్రీనివాసులు నుంచి రూ.3.18 లక్షలు, అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా సహాయ కమిషనర్ శ్రీనివాస్ దగ్గర రూ.22.74 లక్షలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో పాటు శ్రీచంద్ర బల్క్ కార్గో ప్రతినిధి భరత్‌కుమార్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ప్రాథమికంగా ఈ వ్యవహారంలో పాత్రధారులైన అధికారులను బదిలీ చేశారు. సీబీఐ నివేదిక ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

ఆహారం డొల్ల... ఆరోగ్యం గుల్ల..!

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ఘుమఘుమలాడే వంటకాలు.. కంటికి ఇంపుగా కనిపించే కర్రీలు చూస్తే లొట్టలేయాలనిపించే విధంగా వడ్డిస్తుంటే చూస్తూ ఊరుకోం కదా.. అయితే వాటిని నిల్వ ఉంచిన మాంసం, హానికరమైన రంగులతోను, పాడైన సరకులతో తయారు చేసి పెడుతున్నారని అధికారులు గుర్తించారు. దీంతో ఆహారం డొల్ల... ఆరోగ్యం గుల్ల అన్నట్లు మారింది తుని మండలం ఎన్‌హెచ్ పక్కన నిర్వహిస్తున్న హోటళ్ల తీరు.. గడిచిన ఆర్నెళ్లలో తేటగుంట పరిధిలో నాలుగు హోటళ్లపై జిల్లా ఆహార తనిఖీ అధికారులు మూడు సార్లు దాడులు చేసి నిర్వాహకులకు నోటీసులు ఇచ్చిన తీరు మారకపోవడం గమనార్హం. దీంతో మంగళవారం జిల్లా అదనపు ఆహార తనిఖీ అధికారి సుబ్బారావు తన బృందంతో తేటగుంట కూడలి వద్ద దాబాలో మంగళవారం తనిఖీ చేశారు. వంటశాలలో గడ్డకట్టి నిల్వఉన్న మాంసం, రొయ్యలను గుర్తించారు. అదేవిధంగా చిల్లీ పౌడర్, చికెన్ బిర్యాని, జీడిపప్పు నమూనాలు సేకరించారు. వీటిని హైదరాబాద్ ల్యాబ్‌లో పరీక్షించి నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాహకులు నిబంధనలు పాటించాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తేటగుంట ఎన్‌హెచ్ పక్కన దాబాలో తనిఖీలు చేస్తున్న అధికారులు

'వైమానిక దళం' భారత్‌కు గొప్ప ఆస్తి

గాంధీనగర్, న్యూస్‌టుడే: అసమానమైన శౌర్యం, సమగ్రతతో దేశానికి సేవ చేసిన వైమానిక యోధులకు ఇది నివాళి అని, ఇది భారత సైనిక శక్తికి గొప్ప ఆస్తి అని వింగ్ కమాండర్ ఎన్‌సీసీ పి.ప్రవీణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జేఎన్‌టీయూకేలో 9(ఆంధ్ర) వైమానిక ఎన్‌సీసీ కాకినాడ విభాగం ఆధ్వర్యంలో వైమానిక దళ దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ వైమానిక దళ ప్రాముఖ్యతను వివరించారు. సాధారణంగా మొదలై ప్రపంచంలోని బలీయమైన దళాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. వింగ్ కమాండర్ ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ దశాబ్దాలుగా సాంకేతికత, అంకితభావం, వృత్తి నైపుణ్యం, ధైర్యం ప్రదర్శించిందన్నారు. ఈ సందర్భంగా కేకు కోసి వేడుకలు నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కల్నల్ సీకే.నాయక్, గర్ల్స్ విభాగ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్.మాణిక్, కోస్టుగార్డ్ కమాండింగ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్, విశ్రాంత గ్రూప్ కెప్టెన్‌లు ఐవీఆర్.రావు, హెచ్ఎస్.బాలి, ఏఎన్ఓలు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.


వేడుకల్లో కేకు కోస్తున్న జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ, కాకినాడ గ్రూప్ కల్నల్ నాయక్

బాలికపై అమానుష ఘటన బాధాకరం: వర్మ

పిఠాపురం: పిఠాపురంలో బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన అమానుషమని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పిఠాపురంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడిన తెదేపా కార్యకర్త దుర్గాడ లక్ష్మణ్ అలియాస్ జాన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన, సహకరించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇలాంటి ఘటనలను తెదేపా ఖండిస్తుందన్నారు. వైద్యంకోసం బాధితురాలిని కాకినాడ పంపించారని, అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామన్నారు. పిఠాపురంలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని కోరారు. ప్రధాన కూడళ్లలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయని, ముఖ్యంగా చిత్రాడ, రథాలపేట, మాధవపురం రైల్వే వంతెనల వద్ద గస్తీ నిర్వహించాలన్నారు. మద్యం తాగి, మత్తుకు బానిసై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. నాయకులు సూర్యప్రకాష్, చిన్నా, శ్రీను, నగేష్, రాజా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది భర్తీకి దరఖాస్తులు

కాకినాడ నగరం: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధనేతర సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా ఇన్‌ఛార్జి ఏపీసీ పి.రమేష్ తెలిపారు. ఒప్పంద (కాంట్రాక్టు), పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పోస్టులను భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో టైప్-3 కింద హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 3, వాచ్‌మన్ 2, స్కావెంజర్ 4, స్వీపర్ 2 పోస్టులు భర్తీ చేస్తారన్నారు. టైప్-4 కింద అసిస్టెంట్ కుక్ 1 పోస్టును భర్తీ చేస్తారని వివరించారు. సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ కేటగిరికి 18-42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 5 ఏళ్లు, మాజీ సైనికోద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుందన్నారు.

లలితాంబ.. ఉషాకిరణ ప్రభ..



గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దుర్గాడ శివాలయంలో మంగళవారం లలితామాతపై సూర్యకిరణాలు ప్రసరించాయి. దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసి అలంకరించిన లలితామాతపై సూర్యకిరణాల ప్రభ కనిపించింది. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


పిఠాపురం: పి.రాయవరంలో రూ.5 లక్షల నోట్లతో..


కరప: పెద్దాపురప్పాడులో లక్ష్మీదేవి..


రౌతులపూడిలో మహాలక్ష్మి దేవిగా..

దుర్గామాతా.. నమోస్తుతే

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవార్లను రోజుకో రూపంలో అలంకరించి పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో మంగళవారం అమ్మవార్లను కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. – న్యూస్‌టుడే, బృందం

అంకురాలు అద్భుతః..

గాంధీనగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆలోచనలకు రూపమివ్వడమే స్టార్టప్ ఫెస్ట్ లక్ష్యమని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ. మురళీకృష్ణ పేర్కొన్నారు. వీటికి ఆర్థికసాయం అందిస్తున్న జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి, సుబు కోట ఫౌండేషన్ ఛైర్మన్ సుబు ఎం.కోట కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం ఫౌండేషన్ సహకారంతో యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్టార్టప్ ఫెస్ట్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ హాజరయ్యారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎనేబుల్డ్ బయోనిక్స్‌కు రూ.2.5 లక్షలు, ద్వితీయం స్థానంలో నిలిచిన ప్రోగ్రెస్ పయినీర్స్‌కు రూ.1.5 లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్ స్టార్టప్‌కు రూ.లక్ష అందజేశారు. ముగింపు వేడుకలో ఇన్‌ఛార్జి వీసీ మాట్లాడుతూ స్టార్టప్ ఫెస్ట్-2024లో భాగంగా ఏడాదిగా నిర్వహిస్తున్న కార్యక్రమాలతో 150 అంకురాల్లో 7 వినూత్న ఆలోచనలను ఎంపిక చేసి విద్యార్థులను ప్రోత్సహించేందుకు సుబు కోట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెంటార్లను నియమించారన్నారు. ఐటీ లీడర్, విద్యావేత్త పి.సురేష్, రావా ఏఐ కోఫౌండర్, సీఈఓ కిరణ్‌బాబు, జేఎన్‌టీయూకే ఐక్యూఏసీ డైరక్టర్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. క్రాస్ బోర్డర్స్ ఫౌండర్ సుబ్బరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. క్రాస్ బోర్డర్స్ ప్రతినిధి సిద్ధు, అధ్యాపకులు రఘురామ్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

నడకకు ఊతం..

జేఎన్‌టీయూకేలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న జోష్, సూర్య, రియాజ్ మొహమ్మద్‌లు ఎనేబుల్డ్ బయోనిక్స్ పేరుతో ప్రాజెక్టు రూపొందించారు. ప్రమాదానికి గురైన వారు కోలుకున్న తర్వాత నడిచేందుకు ఫోర్‌లెగ్ వాకర్, ఆపై టూలెగ్ వాకర్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇందుకు రెండు పరికరాలు కొనాలి. ఒకేదాన్ని రెండు రకాలుగా ఉపయోగించుకునేలా ఎనేబుల్డ్ బయోనిక్స్ ప్రాజెక్టు తయారుచేశారు. దీనికి అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. నమూనా తయారీ చేస్తున్నారు. ఎనేబుల్డ్ బయోనిక్స్ పరికరం తయారు చేసేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడి అతి తక్కువ ధరకే అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యం అంటున్నారు.


విజేతలకు నగదు అందజేస్తున్న అతిథులు

స్థానిక ఉత్పత్తులకు పెద్దపీట..

జమ్మూకు చెందిన హిమంతు, మనీష్, వికాస్‌లు జేఎన్‌టీయూకేలో సీఎస్‌సీ చదువుతున్నారు. ప్రోగ్రెస్ పాయినీర్స్ పేరుతో గోలోకల్ పేరుతో యాప్‌ను తయారు చేస్తున్నారు. జమ్మూ కశ్మీర్‌లో స్విగ్గీ, జొమాటో వంటి యాప్‌లు అందుబాటులో ఉండవు. ఈ క్రమంలో స్థానిక ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ఈ యాప్ తయారుచేశారు. జమ్మూకశ్మీర్‌లో మొదటిసారి ప్రవేశపెడతాం అంటున్నారు. అక్కడ స్పందన బాగుంటే మిగిలిన ప్రాంతాల్లోనూ ప్రవేశపెడతామని అంటున్నారు. ఇందులో స్థానిక దుకాణదారులతో అనుసంధానమై యాప్‌లో ప్రదర్శిస్తారు. అవసరమైన వారికి చేరవేస్తారు.

ఆలోచనలను ఆవిష్కరిస్తూ..

శ్రీరామ్, వెంకట్, ఆదర్శ్ జేఎన్‌టీయూకేలో సీఎస్ఎం ఇంజినీరింగ్ చేస్తున్నారు. మెదడు ఉపయోగించి టీవీ, ఫ్రిజ్, ఏసీ వంటి వాటిని ఆపరేట్ చేయాలనే ఆలోచనతో కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్ అంశంతో రూపొందించారు. తొమ్మిది నెలలుగా ఈ ప్రాజెక్టుపై పనిచేశారు. ఒక రీసెర్చ్ పేపర్ చదువుతున్నప్పుడు వచ్చిన ఆలోచనతో పక్షవాతం వంటి రోగులకు, కాళ్లు, చేతులు కదపలేని వారికి ఉపయోగపడేలా దీన్ని తయారు చేశారు. ఓ పరికరాన్ని తలకు పెట్టడం ద్వారా బ్రెయిన్‌లో అనుకున్నది జరిగేలా సాఫ్ట్‌వేర్ తయారుచేస్తున్నారు. ఒత్తిడి లేకుండా పనిచేసుకోవచ్చు. రోగులకు ఉపయుక్తంగా ఉంటుంది.

నవంబరులో ఏపీ సాంస్కృతిక వైభవం సదస్సు

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం) న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో నవంబరు 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు నిర్వహించనున్నామని వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను వర్సిటీలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ఆంగ్ల విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని వివరించారు. కన్వీనర్లుగా ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.ఎన్.సజనారాజ్ వ్యవహరిస్తారని వెల్లడించారు.


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు

పత్ర సమర్పణలకు ఆహ్వానం..

రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలను ఆహ్వానిస్తున్నామని వీసీ తెలిపారు. అవధానం, దండకం, శతకం, పద్య కవిత్వం తదితర సాహిత్య ప్రక్రియలు, కూచిపూడి, ఆంధ్ర నాట్యం, థింసా గిరిజన నృత్యాలు, జానపద కళారూపాలు, బుర్రకథ, హరికథ, తోలుబొమ్మలాట, తప్పెటగుళ్లు, మొదలైన సాహిత్య జానపద, సాంస్కృతిక అంశాలపై రచనలు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, సంస్కృతి, ఆహారపు టలవాట్లు, వస్త్రధారణ రీతులు, శిల్ప నిర్మాణ శాస్త్రాలు, క్రీడలు, పండుగలు, ఉత్సవాలు, హస్త కళారూపాలు, జీవన విలువలు, సంస్కరణలు, సేవాభావం, విశ్వబంధు భావన తదితర సాంస్కృతిక అంశాలపై సదస్సులో చర్చలు ఉంటాయన్నారు.

25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్..

సదస్సులో పాల్గొనేవారు ఈనెల 25లోగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, పరిశోధన పత్రాలు సమర్పించాలని వీసీ కోరారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కాప్స్ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, ఓలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన : పళ్లంరాజు

కాకినాడ కలెక్టరేట్: కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యమని ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ ఎం.ఎం.పళ్లంరాజు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, నక్కా సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, కాకినాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. సభలో పళ్లంరాజు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పుంజుకుంటోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకుంటామన్నారు. బాధ్యతలు చేపట్టిన నాయకులను సత్కరించారు. ఏపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మస్తాన్‌వలీ, నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, కామన ప్రభాకరరావు, బండారు జయప్రకాశ్, అయితాబత్తుల సుభాషిణి, దాట్ల గాంధీరాజు, తాళ్లూరి రాజు, బత్తిన లలిత తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని శిక్షించాలి

పిఠాపురం: బాలికపై అత్యాచారం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం వైకాపా ఇన్‌ఛార్జి వంగా గీత పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. వైకాపా జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం స్పందించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను సీపీఎం నాయకులు పరామర్శించారు. అతడికి సహకరించిన మహిళపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం, సీఐటీయూ, ఐద్వా నాయకులు కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.మణి, సూర్యనారాయణ, మణికంఠ తదితరులు కోరారు.

సభ్య సమాజం తలదించుకునే ఘటన..: పిఠాపురంలో బాలికపై జరిగిన అత్యాచార ఘటన సభ్యసమాజం తలదించుకునే ఘటనని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి అన్నివిధాలుగా జనసేన అండగా ఉంటుందన్నారు.

అమ్మవారిని హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి

సర్పవరం జంక్షన్: అమ్మవారిని పూజ గదిలో కాకుండా హృదయంలో ప్రతిష్ఠించుకుని ఆరాధించాలని, నిత్యం పూజలు, మననం చేసుకోవడం ద్వారా అమ్మవారి కృపకు పాత్రులం కాగలమని పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. దేవీనవరాత్రుల్లో ఆరో రోజు మంగళవారం కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేదపండితులు సహస్రరుద్ర పారాయణం, శతచండీ తదితర హోమాలు నిర్వహించారు. సుమారు 30 వేల మంది కుంకుమ పూజల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు ట్రాఫిక్‌ను నియంత్రించారు. బుధవారం 24 వేల మంది విద్యార్థులతో త్రికోటి మహాసరస్వతి పూజ నిర్వహిస్తామని పీఠాధిపతి తెలిపారు. రిజిస్ట్రేషన్లు చేసుకోనివారినీ అనుమతిస్తామని, ఉదయం 6 గంటలకు పూజ ప్రారంభమవుతుందన్నారు.



రాజరాజేశ్వరిగా ఐశ్వర్యాంబిక, శ్రీపీఠంలో సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

గ్యాస్ ట్యాపింగ్ పాయింట్ వద్ద నిరసన

తాళ్లరేవు: తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని సుంకటరేవు గ్యాస్ ట్యాపింగ్ పాయింట్ వద్ద సర్పంచి వెంటపల్లి నూకరాజు, జక్కల ప్రసాదబాబు, వడ్లమూరి సతీష్, పలివెల అప్పారావు ఆధ్వర్యంలో సుంకటరేవు, పోలేకుర్రు, తోటపేట, తూర్పుపేట గ్రామాల ప్రజలు మంగళవారం నిరసన చేపట్టారు. పీఐఎల్ కంపెనీ నిర్వహణలో గ్యాస్ ట్యాపింగ్ పాయింట్ వద్ద జరుగుతున్న పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. ప్రాణాలకు ముప్పు తెచ్చే పనులను నిలిపివేయాలని, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చేయడం తగదన్నారు. వారంతా నిర్వాహకులు ధర్మారావు, సెక్యూరిటీ ఆఫీసర్ త్రినాథరావును గ్రామస్థులు నిలదీసి, ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం వరకు పాయింట్ వద్ద నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ ఆందోళనకారులతో మాట్లాడారు.


సుంకటరేవు వద్ద గ్యాస్ ట్యాపింగ్ పాయింట్‌ను ముట్టడించిన గ్రామస్థులు

తాత్కాలికంగా పనుల నిలుపుదల

సుంకటరేవు పాయింట్ నుంచి పైపులైన్ ద్వారా యానాం రీజన్సీకి గ్యాస్‌ను పంపించేందుకు నిర్మాణ పనులు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆందోళనకారులతో రెవెన్యూ, పోలీసు అధికారులు చర్చించారు. సమస్యపై నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. తాత్కాలికంగా పనులు నిలుపుదల చేశారు. దున్నా సింహాద్రమ్మ, నిమ్మకాయల మూర్తి, యేరుపల్లి వీరన్నయాదవ్, పూడా రామకృష్ణ, సాధనాల శివరామకృష్ణ, కన్నీడి నాగేంద్రరావు, గుత్తాల రాంబాబు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ	14,000-15,000
	13,500-14,000
కొబ్బరి నూనె	3,750
	260

వెనామీ చికెన్ ధర

	120-00
	142-00
	206-00
	234-00

విశాఖలో వాహనం.. తునిలో గొలుసు దొంగతనం

మహిళ మెడలో ఆభరణాలు లాక్కెళ్లిన దుండగులు

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ఎంవీపీ కాలనీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ఖరీదైన బైక్‌ను ఇద్దరు దుండగులు చోరీ చేశారు. తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో ఈ బైక్ చోరీ జరిగినట్లు అక్కడి సీసీ కెమెరాలో దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం సుమారు 100 కి.మీ. దూరంలో తుని పట్టణానికి అదే బైక్‌పై వచ్చి సంచరించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఓ గ్రామీణ ప్రాంత మహిళను లక్ష్యంగా చేసుకుని దుండగులు మధ్యాహ్నం 3.30 గంటలకు మెడలోని సుమారు 40 గ్రాముల బరువు ఉన్న రూ.2.50 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు లాక్కెళ్లిపోయారు. ఈ చోరీ దృశ్యాలు కూడా దగ్గరలోని ఓ దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి. విశాఖలో బైక్ చోరీ చేసిన సమయానికి సరిగ్గా 12 గంటల వ్యవధిలో ఇక్కడ చోరీ జరగడం గమనార్హం. మండలంలోని వెలమకొత్తూరు నుంచి పట్టణంలోని వస్త్ర దుకాణానికి వచ్చిన బాధితురాలు లక్ష్మీ తిరుగు ప్రయాణమైన సందర్భంలో ఈ దాడి జరిగింది. ఇద్దరు చోరుల వయసు పాతికేళ్లలోపే ఉంటుంది. ప్రత్యేక బృందాలు గాలింపు ప్రారంభించాయి. దుండగులు విశాఖలో దొంగిలించిన బైక్‌పైనే ఇటు వచ్చి చోరీ చేశారని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. తుని నారాయణ రాజుగారి వీధిలో చోరీ చేశాక మెయిన్ రోడ్డు నుంచి బెల్లపువీధి వైపు వెళ్లిన దుండగులు మళ్లీ అటు విశాఖ వైపునకు వెళ్లారా? లేక రాజమహేంద్రవరం వైపు పయనం అయ్యారా? అనేది పరిశీలిస్తున్నారు.


విశాఖలో బైక్ చోరీ చేస్తున్న దుండగులు


తునిలో మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కొనిపోతున్న చోరులు

నాయకుడి ఇంట 128 మద్యం కేసులు స్వాధీనం

ఎన్నికలకు ముందే వైకాపా నుంచి తెదేపాలోకి..

తుని గ్రామీణం: మండలంలోని ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లోని ఒక నాయకుడి ఇంట్లో సుమారు 128 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. మంగళవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో కొన్ని నెలలుగా నిల్వ ఉంచిన మద్యం కేసులను గుర్తించి తుని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. మండలంలోని కేవో మల్లవరానికి చెందిన వైకాపా నాయకుడు సుర్ల గోవింద్ ఎన్నికలకు ముందు తెదేపాలోకి చేరారు. ఆయన ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న ఇంట్లో ఈ మద్యం సీసాలను గుర్తించామని రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మరో మూడు డంప్‌లు ఉన్నట్లు సమాచారం వచ్చిందని వాటిపై దాడులు చేసి స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలిపారు.


ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నిల్వ చేసిన మద్యం కేసులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ చెన్నకేశవరావు

కొండుకుదురులో విషాదం

లోడు ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

తాళ్లరేవు, అయినవిల్లి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం 216వ జాతీయ రహదారి చొల్లంగి వద్ద కొబ్బరి కాయల లోడు ఆటో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామానికి చెందిన ర్యాలీ సత్తిరాజు(42) చిల్లరగా కొబ్బరికాయలు కొనుగోలు చేసి వాటిని అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటారు. మంగళవారం ఆటోలో కాకినాడ వైపు కొబ్బరికాయలు లోడు తీసుకువెళ్తున్న సమయంలో తాళ్లరేవు మండలం చొల్లంగి వద్ద ఆటో ప్రమాదవశాత్తు పంటకాలువలో పడిపోయింది. ఈసంఘటనలో ఆటోతో సహా కొబ్బరికాయలు ఆయనపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సత్యవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


సత్తిరాజు (పాత చిత్రం)


ప్రమాదానికి గురైన ఆటో

ముగ్గురు సొసైటీ సిబ్బంది సస్పెన్షన్

గొల్లప్రోలు: గొల్లప్రోలు విశాల సహకార పరపతి సంఘంలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ సొసైటీకి పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాకినాడ సబ్‌డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.నందన ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీలో సిబ్బందిగా ఉన్న కుర్రే సూర్యశంకర్ సుబ్రహ్మణ్యం, బస్వా వీరలవకుశ, బస్వా గోవిందులను సర్వీసు నిబంధనావళిని అనుసరించి విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు నెలలుగా అసభ్య పదజాలంతో బాధిస్తున్నట్లు ముగ్గురు సిబ్బందిపై ఇదే సొసైటీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని చేసిన ఫిర్యాదుపై నందన సోమవారం ప్రాథమిక విచారణ నిర్వహించి సమావేశ తీర్మానం మేరకు సస్పెండ్ చేశారు. మంగళవారం నుంచి ఉత్తర్వులు అమలులోకి వస్తాయని సొసైటీ సీఈవో సూరిబాబు తెలిపారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 40, వంకాయలు - 40, 44, 64, బెండకాయలు - 38, పచ్చిమిర్చి - 28,32, కాకరకాయ - 38, బీర - 50, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 46, దొండకాయలు - 48, బంగాళాదుంపలు - 30,34, ఉల్లి - 46,50, గోరుచిక్కుడు - 34, దోసకాయలు - 40, ఆనపకాయ - 35,40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుడు - 66,110, చేమదుంపలు - 30,40, మునగకాయలు - 10,12, బీట్‌రూట్ - 38, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 70, అల్లం - 55, క్యాప్సికం - 80, బొబ్బర్లు - 48, చిలకడదుంపలు - 40, మామిడికాయ - 18,20, నిమ్మకాయలు(డజన్) - 24,54.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్- దేవర పార్ట్ 1, దక్షిణ, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4(స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, కాళీ, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- బహిర్భూమి, తిరుమల - మన్మథ(ఉ.రా), కమిటీ కుర్రోళ్లు(మ.సా), సిఅండ్‌సీ 1- మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - రామ్‌నగర్ బన్నీ, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- మిస్టర్ సెలబ్రిటీ, శ్రీశ్రీనివాసా(వేళంగి)- దేవర పార్ట్ 1.

అన్న క్యాంటీన్లతో నాణ్యమైన భోజనం



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ భావన ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నోడల్ అధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్లు, ఎమినిటీ సెక్రటరీలతో మంగళవారం ఆమె సమీక్షించారు. నగరంలోని అయిదు అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నామన్నారు. మూడు పూటలా రోజుకి ఎంతమందికి ఆహారం అందిస్తున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. దీనిపై ఉన్నతస్థాయి పర్యవేక్షణ ఉందన్నారు. వీటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పేదలకు ఇబ్బంది లేకుండా ఆహారం అందేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ టీకే సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్తబుట్టలు తొలగించాలి..



సమస్య: గొడారిగుంట మూడుగుళ్ల సమీపంలోని బైపాస్ రహదారిలో రోడ్డుపై చెత్తబుట్టలు అడ్డుగా ఉంటున్నాయి. రాత్రిళ్లు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం.

- స్థానికులు, గొడారిగుంట

సమాధానం: సిబ్బందిని పంపి తొలగిస్తాం.

- శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగరపాలకసంస్థ

మరమ్మతులకు వినతి



కల్పన కూడలి నుంచి సాలిపేట బాలికోన్నత పాఠశాలకు వెళ్లే రహదారిలో సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. గుంతల కారణంగా రాత్రి సమయంలో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
సాంబమూర్తినగర్: 91548 46719

ఉజ్వల భవితకు.. బరువుల బాధ్యత

న్యూస్‌టుడే, మసీదు సెంటర్

వారంతా సర్కారు కొలువు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. అదేమీ అంత ఆషామాషీ కాదని వారికీ తెలుసు.. అందుకే క్రీడలను ఓ మార్గంగా ఎంచుకున్నారు. అందుకోసం అందరి కన్నా విభిన్నంగా ఆలోచించారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ పొందారు. అందుకోసం కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ(డీఎస్‌ఏ)లో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల డీఎస్‌ఏలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..

సర్కారు కొలువుకు..



9వ తరగతి చదువుతున్నా. నాన్న రాంబాబు లారీడ్రైవర్, అమ్మ మంగ గృహిణి. శారీరక సామర్థ్యం పెంచుకునేందుకు రెండేళ్ల నుంచి డీఎస్‌ఏలో కోచ్ సతీష్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటున్నా. గతంలో 3 జిల్లా స్థాయి పతకాలు, రాష్ట్రస్థాయిలో ఒక రజత పతకం సాధించా. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో 64 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించా. ఐపీఎస్ అధికారి అవ్వాలనేది నా ధ్యేయం. **- రూపశ్రీ**

రైల్వేలో ఉద్యోగమే లక్ష్యం..



10వ తరగతి చదువుతున్నా. నాన్న దుర్గాప్రసాద్ కారు డ్రైవర్, అమ్మ మేరీరత్నం టైలర్. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గతేడాది నుంచి వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో 89 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించా. జాతీయ స్థాయిలో మెరిసి క్రీడా కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించే దిశగా కృషి చేస్తున్నా. **- సంతోష్‌కుమార్**

అంతర్జాతీయ పతకం సాధించాలనేది..



10వ తరగతి చదువుతున్నా. నాన్న అహ్మద్ షనీఫ్ ఇన్‌స్పెక్టర్. అమ్మ ఎండీ ఆశా గృహిణి. తల్లిదండ్రులు, కోచ్ సతీష్‌కుమార్ ప్రోత్సాహంతో గతేడాది నుంచి వెయిట్‌లిఫ్టింగ్‌లో సాధన చేస్తున్నా. ఇటీవల డీఎస్‌ఏలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో 76 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, రాష్ట్రపోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ పతకం సాధించాలనేది నా లక్ష్యం. **- ఎండీ రహమద్ ఉన్నీసా**

ఆర్మీలో చేరతా..



ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతున్నా. నాన్న జగదీష్, అమ్మ నిర్మల వ్యాపారం చేస్తుంటారు. క్రీడలపై మక్కువతో మూడు నెలలుగా వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. డీఎస్‌ఏలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో 102 కిలోల ప్లస్ విభాగంలో బంగారు పతకం సాధించా. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేస్తా. **- అపురూప్**

కుక్కల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన మహిళ, బాలుడు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ సురేష్‌నగర్ ఉద్యానంలో వీధి కుక్కలు దాడి చేయడంతో ఓ బాలుడితోపాటు మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం ఉద్యానంలో వెనుక వైపు ఉన్న జ్ఞాన మందిరంలో యోగా చేసుకుని వస్తున్న ఓ మహిళ, ఉద్యానంలో ఆడుకుంటున్న ఓ బాలుడిపై కుక్కల గుంపు దాడిచేశాయి. బాలుడికి ఆరు చోట్ల గాయాలయ్యాయి. మహిళకు రక్తం వచ్చేలా రెండు చోట్ల తీవ్రంగా గాయపరిచాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ దాడి ఘటనతో సురేష్‌నగర్, శాస్త్రినగర్, శశికాంత్‌నగర్, గొడారిగుంట ప్రాంతాల ఉద్యానంలోకి ప్రజలు ఉద్యానంలోకి అడుగు పెట్టేందుకు భయాందోళన చెందుతున్నారు. నగరంలోని పెద్ద ఉద్యానాల్లో సురేష్‌నగర్ పార్కు ఒకటి. దీనికి వాచ్‌మెన్ లేకపోవడంతో కుక్కల సమస్య విపరీతంగా ఉంది. ఉద్యానంలో రాత్రి పగలు అన్న తేడా లేకుండా వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఇక దీపాలు కూడా అంతంత మాత్రమే వెలగడంతో ఆకతాయిల బెడద కూడా అధికంగా ఉంటోంది. చీకటి పడితే వీరి బెడద అధికంగా ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రెండు, మూడుసార్లు ఘర్షణలు సైతం చోటుచేసుకున్నాయి.

అధికారులు పట్టించుకోవట్లేదు..

ఉద్యానంలో కుక్కల బెడద అధికంగా ఉంది. గతంలో నగరపాలక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఉద్యానానికి పర్యవేక్షకుడు లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆకతాయిల బెడద అధికంగా ఉంటోంది. అప్పుడప్పుడు ఘర్షణలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-లాయర్ బుజ్జి, సురేష్‌నగర్, శాస్త్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ నగరం: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 5,050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన రెసిడెన్షియల్ సంస్థలు, స్టడీ సర్కిళ్లలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ ఇచ్చేందుకు అర్హతలు గల సంస్థలు పోర్టల్ https:///tender.apeprocurement.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత రెండు డీఎస్సీల్లో శిక్షణ ఇచ్చి ఉండాలని, అందులో కనీసం 100 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

హరియాణాలో గెలుపుపై హర్షం

గాంధీనగర్: హరియాణాలో మూడోసారి భాజపా గెలవడంపై ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు తమ తీర్పు ద్వారా అక్కడి ప్రభుత్వం, కేంద్రంలో మోదీ పాలనపై ఉన్న విశ్వాసాన్ని పునరుద్ఘాటించారన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచనలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూములకు సంబంధించిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లతో, మండల సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ భూములు, రీ-సర్వే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రైతులు, ప్రజలకు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించి, నివేదిక ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ప్రతీ సోమవారం వస్తున్న అర్జీలపై క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాలన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులకు స్థలాలను గుర్తించి, ప్రతిపాదనలు పంపాలన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు సామర్లకోట పురపాలక సంఘంలో మురుగునీరు శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ భావన హెచ్చరించారు. మంగళవారం ఆమె జగన్నాథపురంలోని మేకావారివీధి, చిక్కాలవారి వీధి ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. రహదారులు, డ్రెయిన్లలో చెత్త వేయొద్దని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ కాకినాడ సాధ్యమని చెప్పారు. సకాలంలో సిబ్బంది విధులకు హాజరుకావాలని, రోజూ తనిఖీలు నిర్వహిస్తామని, పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ డి.పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అడపా సత్యనారాయణ పాల్గొన్నారు.

హత్య కేసులో పదేళ్ల జైలు

మసీదు సెంటర్: ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.కమలా దేవి తీర్పిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కొర్ర గ్రామానికి చెందిన కోసా మడ్వి రహదారి పనుల పనులకు కాకినాడ వచ్చారు. వ్యక్తిగత కక్షలతో అదే ప్రాంతానికి చెందిన గుత్తుల శ్రీనును 2023 అక్టోబర్‌లో విచక్షణా రహితంగా కర్రతో కొట్టారు. ఆయన మృతిచెందాడు. దీనిపై అప్పటి తిమ్మాపురం ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేయగా సీఐ శ్రీనివాస్ దర్యాప్తు చేశారు. నేరం రుజువుకావడంతో పైవిధంగా తీర్పిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ప్రశాంతికుమారి వాదనలు వినిపించారు.


తాగి వాహనం నడిపినవారికి జరిమానా

మసీదు సెంటర్: మద్యం తాగి వాహనం నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా ఒకరికి నాలుగు రోజుల జైలు, ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 7 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు మంగళవారం తీర్పు చెప్పారు. నగర ట్రాఫిక్-1, 2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు.

రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలి

గాంధీనగర్: సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు తమిళనాడు పెరంబదూర్ శామ్‌సంగ్ ప్లాంట్‌లో కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మెయిన్ రోడ్డులోని సంస్థ షోరూం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ ఎం.వెంకటరమణ, కోకన్వీనర్ పలివెల వీరబాబులు మాట్లాడారు. పెరంబుదూర్‌లోని పరిశ్రమలో నెలరోజులుగా కార్మికులు వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్నారన్నారు. దక్షిణ కొరియాకు చెందిన సంస్థ ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని, కార్మికుల హక్కులు గుర్తించాలన్నారు. పి.సూర్యారావు, కుమారస్వామి, రాజేంద్రప్రసాద్, ఏడుకొండలు, రమణమ్మ, ఈశ్వరి, పద్మావతి, భారతీప్రియ తదితరులు పాల్గొన్నారు.

'వ్యర్థాల' కొండ



కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధి సంజయ్‌నగర్ క్రైస్తవ శ్మశాన వాటిక పక్కన ఉన్న నగరపాలక సంస్థ డంపింగ్ యార్డులో తీవ్ర దుర్వాసన నెలకొంది. తడి, పొడి చెత్త ఇక్కడ డంప్ చేస్తున్నారు. చెత్త ఒబ్బిడి చేయడానికి రోజువారి సిబ్బంది పనిచేస్తారు. ఇక్కడ సరైన పారిశుద్ధ్య చర్యలు లేకపోవటంతో వాసన భరించలేకపోతున్నారు. నగర పరిధిలో 50 డివిజన్ల నుంచి రోజుకు 130 నుంచి 140 మెట్రిక్ టన్నులకుపైగా చెత్తను యార్డుకు తరలిస్తారు. దీన్ని సరిచేసేందుకు పొక్లెయిన్లు, బుల్ డోజర్లు, బ్లేడు వాహనాలు వినియోగిస్తున్నారు. ఇందుకోసం సిబ్బంది, డ్రైవర్లు కలిపి రోజుకు 20 మంది పనిచేస్తుంటారు. చెత్తను తరలించేందుకు 50 నుంచి 100 వాహనాలు రోజూ వస్తుంటాయి. చెత్త దించేందుకు వచ్చిన వాహన డ్రైవర్లు, క్లీనర్లు యార్డులో దుర్వాసనతో సతమతమవుతున్నారు. యార్డు చుట్టూ వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. దోమలకు ఆవాసంగా మారుతోంది. గతంలో యార్డుకు వచ్చే చెత్తను విడదీసేవారు. పొడి చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితాలు, ఇనుము వంటివి వేరుచేసేవారు. మిలిగిన పనికిరాని చెత్తను మాత్రమే యార్డులో దిగుమతి చేసేవారు. గత కొంతకాలంగా యార్డు వద్ద తడి, పొడి చెత్త గ్రేడింగ్ నిలిచిపోయింది. కొండలా పేరుకుపోయిన చెత్త దగ్గర సిబ్బంది పని చేయలేకపోతున్నారు. వారికి కనీస సౌకర్యాలు కూడా లేవు.

అమ్మ ఉత్సవం.. అందరికీ ఆనందం



బాలాత్రిపుర సుందరి ఆలయంలో



పెద్దశివాలయంలో



భానుగుడి శివాలయంలో



వర్తక వ్యాపారం వీధిలో



సంతచెరువు ఆలయంలో కనకదుర్గ అమ్మవారు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం జరిగాయి. సాయంత్రం అమ్మవారు సింహారోహణంపై దర్శనమిచ్చారు. సంతచెరువు వద్ద గల కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో అపర కాళికాదేవిగా అలంకరించారు. మాధవనగర్‌లోని శ్రీకనకదుర్గా ఆలయంలో కాత్యాయని మాతగా కనువిందు చేశారు. భానుగుడి సెంటర్‌లోని ఉషాబాలాత్రిపుర సుందరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద గల కనకదుర్గ ఆలయంతోపాటు, సూర్యనారాయణపురం, అచ్యుతాపురం, గాంధీనగర్, బాలాజీచెరువు, వెంకట్‌నగర్, వార్ఫురోడ్డు, శ్రీరామ్‌నగర్, శారదాంబ ఆలయం వంటి ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

గీత కార్మికులకు దరఖాస్తు రుసుము తగ్గించాలి



నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కేటాయించిన 10 శాతం మద్యం దుకాణాలకు దరఖాస్తు, లైసెన్సు ఫీజులను తగ్గించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రామారావుపేట శెట్టి బలిజ కమ్యూనిటీ హాల్లో జిల్లా బీసీ సంఘాల నాయకుల సమావేశం జరిగింది. యునైటెడ్ బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. తెదేపా నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నులకుర్తి వెంకటేశ్వరరావు, కల్లుగీత సంఘం జిల్లా కన్వీనర్ కాదా కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా బీసీలకు 10 శాతం మద్యం దుకాణాల కేటాయింపుపై నులుకుర్తి వెంకటేశ్వరరావు.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,786 దుకాణాలకు గాను బీసీల్లోని గీత కార్మికులకు 340 దుకాణాలు కేటాయించటంపై కృతజ్ఞతలు చెప్పారు. ఈ దుకాణాలను గీత కార్మిక సోదరులు బినామీలకు కట్టబెట్టకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ గీత కార్మికులకు జిల్లాల వారీగా ఏఏ ప్రాంతాల్లో కేటాయిస్తారో ముందుగానే తెలపాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు భరించలేరన్నారు. దరఖాస్తు, లైసెన్సు ఫీజును తగ్గించాలని కోరారు. బీసీల పేరుతో మద్యం దుకాణాల్లో బినామీలు ప్రవేశిస్తే సహించేది లేదన్నారు. తామే దుకాణాలను రద్దు చేయిస్తామని వేణుగోపాల్ హెచ్చరించారు. బీసీ సంఘ నాయకులు కొండా వినాయక్, గుత్తుల శ్రీనివాస్, కాకరపల్లి చంద్రశేఖర్, కడియాల సూర్యనారాయణ, చింతా శ్రీనివాస్, పోలవరపు అప్పారావు, పెంకే శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అడుగేయాలంటే అవస్థలు



నగరపాలక సంస్థ 46వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లో కీలకమైన రహదారికి అప్రోచ్ రోడ్డు నిర్మించక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే ఈ రహదారిలో వెళ్లడానికి వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. ఇదే డివిజన్‌లో స్థానిక శారదాంబ గుడి నుంచి చీడీలపొర మీదుగా ప్రభుత్వ ఐటీఐ వెనుకగుండా ఎల్‌బీ నగర్ వరకు స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌తో రూ.16కోట్ల నిధులతో రెండు వరుసల రహదారిని నిర్మించారు. ఎల్‌బీ నగర్ వైపు అప్రోచ్‌రోడ్డు, కల్వర్టు నిర్మించకుండా వదిలేశారు. దీంతో ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అప్రోచ్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, సాంత్వన కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

క్రీడలతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

గాంధీనగర్, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు విద్యార్థులను ప్రోత్సహించాలని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కెవిఎస్‌జి.మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని సెనేట్ హాల్లో జేఎన్‌టీయూకే యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 16వ అనుబంధ కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్నప్పుడే విద్యార్థులు చురుగ్గా ఉంటారన్నారు. జేఎన్‌టీయూకేలో విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు 1.5 క్రెడిట్స్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ శ్యామ్‌కుమార్ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాల నివేదికను వివరించారు. అనంతరం పీహెచ్‌డీ చేసిన ఫిజికల్ డైరెక్టర్లను సన్మానించారు. రెక్టార్ కేవీ.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, యూసీఈకే ఫిజికల్ డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పల్లె పండగకు సన్నాహాలు

గొల్లప్రోలు: గ్రామాల్లో ఈ నెల 14 నుంచి పల్లె పండగ పేరుతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో స్వప్న చర్చించారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

జాతీయస్థాయి టీటీ పోటీల్లో పతకాలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన సీబీఎస్ఈ జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు అండర్ 17 విభాగంలో స్థానిక రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థినులు చిట్టూరి సాయిశ్రుతి, ఎం.శాంతిజ్యోతి, మువర్ణాదాస్‌లు ప్రతిభ చూపి పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, పాఠశాల జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర్, ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి అభినందించారు.



మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: కాకినాడ గ్రామీణం వలసపాకలలో కోరమాండల్ కర్మాగారం నుంచి సముద్ర తీరానికి వెళ్లే దారిలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. - టి.సత్యనారాయణ

పరిష్కారం: కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తికి తెలుపగా స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త తొలగించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

కొత్తమ్మతల్లికి నైవేద్యం ర్యాలీ



తాళ్లరేవు: పెదవలసల గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవాలు జరిగాయి. లక్ష్మీపతిపురం సరిహద్దులో ఉన్న కొత్తమ్మ తల్లికి నైవేద్యాన్ని ర్యాలీగా తీసుకెళ్లి, సమర్పించారు.

ఇసుక మేట.. ఉపాధితో సాగు బాట

ఏలేరు వరదకు పంట పొలాలు నాశనమయ్యాయి. కాలువకు గండ్లు పడడంతో సమీప ప్రాంతాల చేలల్లో ఇసుక మేటలేసింది. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. తాజాగా ఇసుక మేటల తొలగింపును ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసింది. దాంతో వ్యవసాయ, ఉపాధి హామీ పథకం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గంలో ఏటా 45 వేల ఎకరాల్లో వరి పండిస్తుంటారు. ఇందులో 25 వేల ఎకరాలు ఏలేరు ఆయకట్టుపై ఆధారపడి ఉంటుంది. ఆగస్టు నెలాఖరు, సెప్టెంబరు మొదటి వారంలో వరదల ప్రభావానికి ఏలేరు జలాశయం నుంచి 28 వేల క్యూసెక్కుల వంతున నీరు దిగువకు విడుదల చేశారు. 20 చోట్ల గండ్లు పడడంతో శివారు ఆయకట్టు పిఠాపురం, గొల్లప్రోలు మండలాలు మునిగాయి. వారం పాటు పొలాల్లో నీరు నిల్వ ఉంది. దాంతో మూడు మండలాల పరిధిలో 12,285 మంది రైతులకు చెందిన 17,857 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఇదే సమయంలో పుంత రోడ్లు కొట్టుకుపోయి పొలాల్లో రాళ్లు చేరి, ఇసుక మేట వేసింది. ఇలా నష్టపోయిన రైతులందరికీ 20 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.17.85 కోట్ల నష్ట పరిహారం అందించింది. ఉద్యాన కౌలు రైతులకూ సాయం అందింది. ఇప్పుడు ఇసుక మేటలు తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దాంతో రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు.



రాపర్తి వద్ద ఇసుక మేటలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

43 ఎకరాలు.. 68 మంది రైతులు

వరదల కారణంగా పిఠాపురం మండలంలో జములపల్లి, రాపర్తి, వీరరాఘవపురం, భోగాపురం, మాధవపురం 32 ఎకరాల్లో 48 మంది రైతులు, గొల్లప్రోలులోని పడాలవారిదిబ్బ ప్రాంతంలో 20 ఎకరాల్లో 11 మంది రైతులు ఉన్నట్లు గుర్తించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గట్లపై వేశాక ఇసుకను మూడు కిలోమీటర్ల లోపు తరలించేందుకు రవాణా ఛార్జీలు సైతం ఇవ్వనున్నారు.

అంచనాలు తయారు చేస్తున్నాం

ఇసుక మేటలు వేసిన ప్రాంతాలను గుర్తించి, రైతుల వివరాలు సేకరిస్తున్నాం. తొలగింపునకు అంచనాలు తయారు చేస్తున్నాం. ఎకరాకు 7,500 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉంటే 500 మంది కూలీలు అవసరం. క్యూబిక్ మీటర్‌కు రూ.250 చెల్లిస్తారు. రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలి.

- నాయుడు, ఏపీవో, పిఠాపురం

శిక్షణతో నైపుణ్యం మెరుగు

కాజులూరు, గొల్లప్రోలు: శిక్షణతో నైపుణ్యం పెంచుకోవచ్చని ఎంపీడీవో రాంబాబు అన్నారు. మంగళవారం కాజులూరులో రెండు రోజుల పాటు జరుగుతున్న పంచాయతీ సభ్యుల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఎంపీపీ మాత బాబి పాల్గొన్నారు. ● గొల్లప్రోలులో శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈవోపీఆర్డీ కుమార్, రిసోర్స్‌పర్సన్ రాజు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో స్వప్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల ప్రదర్శన

గొల్లప్రోలు: కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాదేపల్లి సత్యానందరావు ప్రమాణ స్వీకారం చేసేందుకు గొల్లప్రోలు నుంచి కాకినాడకు ప్రదర్శనగా బయలుదేరారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని సత్యానందరావు తెలిపారు.

ఏజీపీగా నరేష్‌కుమార్



పెద్దాపురం: పెద్దాపురంలోని ఏడో అదనపు జిల్లా కోర్టుకు ఏజీపీగా న్యాయవాది కందుల నరేష్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్ అండ్ లెజిస్లేటివ్ ఆఫైర్స్ అండ్ జస్టిస్ కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. తనను ఏజీపీగా నియమించడానికి ఎమ్మెల్యే చినరాజప్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజాసూరిబాబురాజు, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి కృషి చేశారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సత్కరిస్తున్న జనసేన నాయకులు

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

కాజులూరు: గొల్లపాలెం శివారు ధనలక్ష్మి పేటలో కాలువ నిర్మాణానికి స్థానిక నాయకులు మంగళవారం శంకుస్థాపన చేశారు. సర్పంచి పోతురాజు ప్రసన్న మౌనిక, ఉపసర్పంచి భువనేశ్వరీదేవి తదితరులు పనులు ప్రారంభించారు.

బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాల్సిందే

కరప, పెద్దాపురం: దీపావళి నేపథ్యంలో నిబంధనలు పాటించని బాణసంచా తయారీ, విక్రయాల నిర్వాహకులపై కఠిన చర్యలు చేపడతామని కాకినాడ గ్రామీణ సీఐ చైతన్యకృష్ణ హెచ్చరించారు. కరప మండలం వేళంగి, నడకుదురులలోని తయారీ కేంద్రాలను మంగళవారం తహసీల్దారు సత్యనారాయణ, ఎస్సై సునీతతో కలిసి తనిఖీ చేశారు. ● సూరంపాలెం రోడ్డు జగనన్న కాలనీలోని ఒక ఇంట్లో 300 కేజీల బాణసంచా సామగ్రిని మంగళవారం స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మౌనిక తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గొల్లప్రోలు: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపరచాలని ఆశ కార్యకర్తలనుడాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రామ్‌కుమార్ ఆదేశించారు. గొల్లప్రోలులో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఇంటింటా సర్వే, విషజ్వరాలు ప్రబలుతున్న తీరుపై సమీక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూమి సారవంతం

తాళ్లరేవు, పెదపూడి: ప్రకృతి వ్యవసాయంతోనే భూమి సారవంతంగా మారుతోందని రాష్ట్రస్థాయి అధికారి చంద్రశేఖర్ అన్నారు. పి.మల్లవరంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు ధూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ● తక్కువ పెట్టుబడితో లాభసాటి వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం పెదపూడిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు సూచనలిచ్చారు.



భువనేశ్వరి పీఠంలో..



శ్రీమహాలక్ష్మీదేవిగా మరిడమ్మ



సామర్లకోటలో..



రాపర్తిలో శాకంబరిగా..

అమ్మ దర్శనం.. అభయప్రదానం

పిఠాపురం; సామర్లకోట, పెద్దాపురం, కరప, తాళ్లరేవు: పాదగయ క్షేత్రంలో దసరా శరన్నరాత్రి, చండీయాగ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, రాజరాజేశ్వరి కాళికాదేవిగా దర్శనమిచ్చారు. పి.రాయవరంలోని దుర్గమ్మతల్లికి రూ.5లక్షల నోట్లతో లక్ష్మీదేవి అలంకారం చేశారు. ● పెద్దాపురప్పాడులో ఉమాపార్వతి అమ్మవారిని కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సింహారోహణ అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. ● సామర్లకోట చాళుక్య కుమారరామా భీమేశ్వరాలయంలో మహాలక్ష్మీదేవికి పూజలు చేశారు. పెద్దాపురంలో మరిడమ్మ, కాండ్రకోటలో నూకాలమ్మ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.



గ్రాంటులో 60వేల కరెన్సీతో లక్ష్మీదేవి..



కరపలో సింహారోహణ అలంకరణ



గొల్లప్రోలులో కరెన్సీ నోట్లతో..

ఖాతా లోపాలు సవరించుకోండి

గొల్లప్రోలు: పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వపరంగా మంజూరయ్యే పరిహారం పొందేందుకు బ్యాంకు ఖాతా లోపాలు సరిచేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి సత్యనారాయణ రైతులకు సూచించారు. చేబ్రోలు రైతుసేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పలు అంశాలను వివరించారు.

పీఏసీఎస్‌లో పనులపై ఆరోపణ.. విచారణ

కరప: కరప ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంపై కలెక్టరేట్‌లో చేసిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ నిర్వహించారు. పీఏసీఎస్ భవనం పైఅంతస్తు, ప్రహరీ నిర్మాణ పనులకు బిల్లులు లేకపోవడం తదితర అవకతవకలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతు భేరి రామకృష్ణ ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.ఉమాశంకర్ కరప పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం పలువురు రైతులతో కలిసి విచారణ చేశారు. శ్రీనివాస్, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, సత్యప్రసాద్, సుబ్బరాజు, వీరబాబు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 12 మందికి గాయాలు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని పంచాయతీనగర్, రైల్వేస్టేషన్ వీధి, శివాలయం వీధి, నందిరాయివీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం పిచ్చికుక్క దాడి చేయడంతో 12 మంది గాయపడ్డారు. వారిలో నలుగురు గొల్లప్రోలు పీహెచ్‌సీకి వెళ్లగా ప్రాథమిక వైద్యసేవలందించి కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. మరో 8 మంది నేరుగా పిఠాపురం, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చేరారు. ఆ కుక్కను స్థానికులు రాత్రి చంపేశారు. గొల్లప్రోలులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శివాలయం ఛైర్మన్‌గా పెదబాబి

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని శివాలయం ఛైర్మన్‌గా గొల్లపల్లి పెదబాబిని ఏకగ్రీవంగా జనసేన నాయకులు ఎంపిక చేశారు. స్థానిక కరణంగారి తోట వీధిలోని కల్యాణ మండపంలో జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. కడారి తమ్మయ్యానాయుడు, మొగలి రాజానాయుడు, మామిడాల సూరిబాబు, అనిశెట్టి నూకరాజు, మర్రి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

'వరద వచ్చినా పండగే..'

సర్పవరం జంక్షన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్రంలో కరవు, వరదలొచ్చినా పండగేనని, సకాలంలో వరద సహాయచర్యలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని కాకినాడ జిల్లా వైకాపా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆరోపించారు. కాకినాడలో మంగళవారం మాట్లాడుతూ వరద సహాయక నిధులు దేనికి ఖర్చుచేశారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపించారు.

మేళాలో 22 మందికి ఉపాధి అవకాశాలు

సామర్లకోట: సామర్లకోట టీటీడీసీలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 22 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్, సీడాప్ జేడీఎం కిరణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అందించే సేవల్లో ఆనందం

తాళ్లరేవు: పేదలకు అందించే సేవలోనే ఎంతో ఆనందం ఉంటుందని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ అన్నారు. తాళ్లరేవు వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో గుడ్ విల్ విజిట్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామికి 108 వెండి గంగాళాలను ఆయన బహూకరించారు. ఇంజరం సాయిబాబా మందిరంలో వెండి కడియం సమర్పించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అద్దేపల్లి సుధ, దాసరి భారతి, కోశాధికారి గోకవరపు శ్రీదేవి, రీజియన్ ఛైర్మన్ అంబిక పాల్గొన్నారు.



108 వెండి గంగాళాలు బహూకరిస్తున్న వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి అంతా కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. మంగళవారం పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పనులు చేపట్టి అభివృద్ధికి పాటుపడదామన్నారు. నిధులను దారి మళ్లించకుండా కేటాయించిన వాటికే వ్యయం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలకు ప్రత్యేకంగా కార్యాలయాల ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తామని, భవనాల నిర్మాణానికి సంబంధిత అధికారులు నిధులు తెచ్చుకోవాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు మిరియాల రాజా, ఎంపీడీవో లలితాకుమారి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి ధర ఘాటు



పెద్దాపురం: సాధారణ మార్కెట్‌లో ఉల్లి ధర నెల రోజులుగా కిలో రూ. 40 నుంచి పెరుగుతూ ప్రస్తుతం రూ. 60కి చేరింది. రైతు బజార్లలో కిలో కర్నూలు ఉల్లి రూ. 36, సోలాపూర్ కొత్తవి రూ. 46, పాతవి మహారాష్ట్ర రూ. 50 ధర పలుకుతోంది. జిల్లాకు రోజుకు సుమారు 95 టన్నుల ఉల్లిపాయలు మహారాష్ట్ర నుంచి వస్తున్నాయి. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లి పంట బాగా దెబ్బతినడంతో ఈ పరిస్థితి వచ్చిందని వ్యాపారులు తెలిపారు.

జీవిత బీమా ఏజెంట్ల నిరసన

పెద్దాపురం: నూతన పాలసీల్లో ఏజెంట్ల కమిషన్‌పై కోతను వ్యతిరేకిస్తూ మంగళవారం పెద్దాపురం జీవిత బీమా కార్యాలయం ఎదుట ఏజెంట్లు నిరసన తెలిపారు. పెద్దాపురం జీవిత బీమా ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు అప్పన నాగేశ్వరరావు, కార్యదర్శి గొండేల జగదీశ్వరరావు, కోశాధికారి బీఎస్ఆర్ శాస్త్రి, ఉపాధ్యక్షులు కొండపల్లి అర్జున్‌రావు, సామిరెడ్డి గోపి, సహాయ కార్యదర్శి వాసంశెట్టి గంగా, గౌరవాధ్యక్షులు ఎస్. గౌరీపతిరావు, గోరింట అబ్బులు, మాజీ అధ్యక్షుడు పడాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



పెద్దాపురం జీవిత బీమా కార్యాలయం ఎదుట ఏజెంట్ల ఆందోళన

సీతారామపురంలో డెంగీ

తాళ్లరేవు: సీతారామపురంలో డెంగీ కేసు నమోదైనట్లు తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్ మంగళవారం తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మికుమారి, ఎంపీహెచ్ఈవో బొడ్డు కుమార్ ఆధ్వర్యంలో జ్వర పీడితులను గుర్తించారు.

పోషకాహారంతో చదువు

సర్పవరం జంక్షన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పోషకాహారంతోపాటు అత్యుత్తమ విద్యనుకూడా అందిస్తున్నామని, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. సర్పవరంలో మంగళవారం ఆయన ఐసీడీఎస్ పీడీ ప్రవీణతో కలిసి సామూహిక సీమంతాలు, పోషకాహారం పంపిణీలో పాల్గొన్నారు. సర్పంచి శీలం చిన్నా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు పెదపూడి మండలం, పెద్దాడ గ్రామ కాపురస్తులు **బొడ్డు (లేటు) భాస్కరరామారావు గారి భార్య జగన్మోహిని గారి** సంజాయిషీపై తెలియచేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి నా క్లయింటు వాటాకు, అనగా కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.S.No. 198/1979లో ఫైనల్ డిక్రీలో రాబడి, నా క్లయింటుకు స్వాధీనము కాబడి, నా క్లయింట్‌చే కాంపౌండ్ గోడ కట్టబడి, నా క్లయింటు యొక్క స్వాధీన, సంపూర్ణ హక్కు భుక్తములతో యుండియున్నది. సదరు ఆస్తిని గూర్చి నా క్లయింటు పరోక్షమున ఎవరు ఎటువంటి వ్యవహారములు జరిపినా చెల్లనేరవని అట్లు జరిపిన వ్యవహారములు నాక్లయింటును గాని, షెడ్యూల్ ఆస్తినిగాని ఎంత మాత్రము బైండ్ చేయజాలవని మరియు అట్లు జరిపిన వారు నష్టపోవుదురని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

షెడ్యూలు

పూర్వము తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ సిటీ, సూర్యారావుపేట, వార్డునెం.2, బ్లాక్‌నెం.8 T.S.No.43/2లో మొత్తం ఎ.0.95 సెంట్లలో పడమర వైపు రోడ్డులో పోగా మిగిలిన ఆస్థి ఈ దిగువ హద్దుల మధ్యస్తమైనది. **తూర్పు:** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల N.F.C.L.వారి కాంపౌండు గోడ. **దక్షిణం :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల N.F.C.L. వారి కాంపౌండు గోడ. **పడమర :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల 100 అడుగుల పావురాల తూము రోడ్ **ఉత్తరం :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల D.S.P. గారి ఆస్థి.

పై ఆస్థి యావత్తు యాజిమెంటు హక్కులతో సహా.

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్,
డోర్‌నెం. 12-1-40, జవహర్ వీధి, కాకినాడ
ఫోన్: 0884-2367503, 98483 14081

కాకినాడ
ది.8-10-2024

ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సామర్లకోట: పట్టణంలో ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉపయోగాలను మహిళా పోలీసులు వివరించి ప్రజలకు అవగాహన కల్పించాలని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు సూచించారు. మంగళవారం సామర్లకోట పోలీసుస్టేషన్‌లో సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్మికుల సంఖ్య పెంచండి

సామర్లకోట: పట్టణ జనాభాకు తగినట్టుగా 40 మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద పట్టణ సీపీఐ అధ్యక్షుడు పెదిరెడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొత్తపల్లి: ఉప్పాడకు చెందిన ఎరిపల్లి శివశంకర్(21) సరిగా చదవడం లేదని, ఏమీ చేయలేకపోతున్నానని మనస్తాపానికిగురై గత నెల 30న పురుగుమందు తాగాడు. కాకినాడలోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీనిపై కేసు నమోదుచేశామని కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం



రాంబాబు (పాత చిత్రం)

తగరపువలస (విశాఖపట్నం): భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక దివీస్ లాబొరేటరీ ఉద్యోగి శెశెట్టి రాంబాబు(28) దుర్మరణం చెందారు. అతని ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. శిరస్త్రాణం ఉన్నప్పటికీ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన స్వగ్రామం దుర్గాడ. కేసు నమోదుచేసినట్లు భీమిలి సీఐ సుధాకర్, ఎస్ఐ హరీశ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సామర్లకోట: స్థానిక సిరిపల్లివారి వీధిలోని కిరాణా వ్యాపారి నేతి జానకీవెంకటరామన్ ఇంట్లో సోమవారం రాత్రి దుండగులు చొరబడి రూ. 10 వేలు నగదు అపహరించుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో దోషికి పదేళ్ల జైలు

సర్పవరం జంక్షన్: తిమ్మాపురం పరిధిలో 2023 అక్టోబరు 19న జరిగిన హత్య కేసులో దోషికి కాకినాడ కోర్టు న్యాయమూర్తి పి.కమలాదేవి పదేళ్ల జైలు శిక్ష విధించారని ఎస్సై రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమ జిల్లా కొర్ర గ్రామానికి చెందిన కోసా మద్వి ఏడీబీ రహదారి పనుల నిమిత్తం కొత్తూరుకు వచ్చాడు. పక్కింట్లో ఉంటున్న గుత్తుల శ్రీనుతో కుట్టు మిషన్ విషయంలో వాగ్వాదం జరిగి మద్వి కర్రతో శ్రీనును విచక్షణరహితంగా కొట్టడంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ఈ కేసులో ఏపీపీ ప్రశాంతికుమారి వాదనలు వినిపించారు. మద్వికి న్యాయమూర్తి కమలకుమారి జైలుశిక్ష విధించారు.



తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట



పెదశంకర్లపూడిలో భవానీ భక్తుల ఉత్సవం

భవానీ సంబరం

ప్రత్తిపాడు: పెదశంకర్లపూడి గ్రామంలో భవానీ సంబరం మంగళవారం వైభవంగా జరిగింది. దుర్గమ్మను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భవానీ మాలధారులు ఈ వేడుకలో పాల్గొన్నారు. రాచపల్లి అరుణాచలేశ్వర క్షేత్రంలో మహాలక్ష్మిగా అపీత కుంచాంబ అమ్మవారిని కొలిచారు.

ఘనంగా కాగితాలమ్మ జాతర

తొండంగి: తమ్మయ్యపేట గ్రామ దేవత కాగితాలమ్మ జాతర, బోనాల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామమంతా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. గరగ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెదేపా నాయకులు యనమల రాజేష్, సాధనాల నూకరాజు, గ్రామ పెద్దలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



తమ్మయ్యపేట జాతరలో పాల్గొన్న నాయకులు, భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

మురుగు తొలగించాలి

జగ్గంపేట గ్రామీణం: గుర్రంపాలెంలో రోడ్లపై మురుగునీరు పారడంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. పాలకులు, అధికారులు దృష్టిసారించి డ్రైన్లు శుభ్రంచేయాలి.

దోమల నివారణకు చర్యలు

శంఖవరం: మండపం గ్రామంలో కాలువల్లో చెత్త పేరుకుని దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సిబ్బందితో శుభ్రం చేయించి ఫాగింగ్, బ్లీచింగ్ చల్లించారు.

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి..

కిర్లంపూడి: జగపతినగరం గ్రామంలో పలుప్రాంతాల్లో వీధిలైట్లు పగటిపూట వెలగడం, మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి పూట వెలగకపోవడంవల్ల గ్రామంలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సమస్యను సర్పంచి మహేంద్రాడ శ్రీలత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని వీధిలైట్లకు గత రెండు రోజులుగా మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

తుని పట్టణం, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, ఏలేశ్వరం, తుని గ్రామీణం, అన్నవరం, జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో అమ్మవారిని ఆలయ వేదపండితులు మహాలక్ష్మీదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తుని పట్టణంలోని గవరపేట ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారు అయింద్రీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బెల్లపువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరిని సరస్వతీదేవి, రాజీవ్‌గృహకల్పలో అమ్మవారిని మహాలక్ష్మీ అలంకరణ చేశారు.● ఏవీనగరంలో శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన దుర్గామాతను ఆలయ కమిటీ రూ.వంద, యాభై నోట్లతో మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. తెదేపా ఎమ్మెల్యే యనమల రామకృష్ణుడు సతీమణి యనమల విజయలక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.● రౌతులపూడి, ఎస్.ఎన్. పట్నం, పి. చామవరం, ములగపూడి, శృంగవరం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనల్లో భక్తులు పాల్గొన్నారు. రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.● శంఖవరం మండలం సీతంపేటలోని దుర్గామీనాక్షి అమ్మవారు మహలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కత్తిపూడిలోని కనకదుర్గమ్మకు భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. గురుభవానీ వెలుగు అప్పారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గావించి బోనాలు తీసుకెళ్లారు. ● ఏలేశ్వరం పట్టణంలోని సంతోషి నగర్‌లో పూజలందుకుంటున్న దేవీ మాత మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చారు. మూడో వార్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ● అన్నవరం దేవస్థానంలో సత్యదేవుని క్షేత్ర రక్షకులు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు భక్తులకు గాయత్రీ దేవి అలంకరణలో మంగళవారం దర్శనమిచ్చారు.● జె.కొత్తూరు, రాజపూడి, మన్యంవారిపాలెం, సీతారాంపురం గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ● జగపతినగరంలోని అభయదుర్గాదేవి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయంలో ఆంజనేయ మూలమంత్రహోమం, అష్టలక్ష్మీపూర్వక చండీహోమంను నిర్వహించారు. కిర్లంపూడిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని వాసవీమాతను అలంకరించి పూజలు, హోమాలు చేశారు.



కత్తిపూడిలో కనకదుర్గమ్మ అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు



జె.కొత్తూరులో..



ఏవీనగరం మహాలక్ష్మీదేవి..



జగపతినగరం అభయదుర్గాదేవి..

ఉత్తరకంచిలో 150 మందికి కంటి పరీక్షలు

ప్రత్తిపాడు: ఉత్తరకంచి గ్రామంలో ఏలేశ్వరం జీసస్ మినిస్ట్రీస్ విజయ ఫౌండేషన్, పిఠాపురం క్రిస్టియన్ మెడికల్ హాస్పిటల్ సంయుక్తంగా కంటి ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈశిబిరాన్ని సర్పంచి మంతిన వెంకటరమణ, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావులు ప్రారంభించారు. డా. ఎస్.విజయబాబు, వైద్యసిబ్బంది 150 మందికి పరీక్షలు చేశారు.

స్వామివారి గరుడ వాహనసేవ

తుని: పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం ఉదయం శ్రీరామ హోమం, గరుడ వాహనసేవ సంప్రదాయబద్ధంగా జరిగాయి. సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

శివలింగాల ప్రదక్షిణ నేడు

తుని, న్యూస్‌టుడే: బెల్లపువీధిలో ఉన్న ఆర్యవైశ్య సంఘ భవనంలో శివలింగాల ప్రదక్షిణల కార్యక్రమం బుధవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని సంఘ నాయకులు తెలిపారు. గత 15 రోజులుగా తునిలో తయారుచేసిన లక్షల శివలింగాలను ఒకేచోట చేర్చి భక్తులు వాటి చుట్టూ ప్రదక్షిణలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అవీ ఇవీ అన్నీ

పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యం

ఏలేశ్వరం: పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. మూడో వార్డులో మంగళవారం 'శుభోదయం- ఏలేశ్వరం' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాలకవర్గం సహకారంలో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తానన్నారు. ఏ విధమైన అవస్థ ఉన్నా తమ దృష్టికి తేవాలని ఆయన స్థానికులకు సూచించారు. కమిషనర్ వెంట ఏఈ అనూష లక్ష్మి, కార్యాలయం, సచివాలయం, మెప్మా సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు రికార్డులు తప్పనిసరి

గండేపల్లి(జగ్గంపేట): ఆటో నడిపే ప్రతీ డ్రైవర్ లైసెన్స్ రికార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జగ్గంపేటలో నాలుగు సెంటర్ కూడలిలో ఆటో యూనియన్ సభ్యులకు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి జనాలను ఆటోల్లో ఎక్కించరాదని హెచ్చరించారు.

గ్రామాల ప్రగతికి సమష్టిగా కృషి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచులు ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంపీడీవో గొల్లపల్లి బుజ్జి, ఈవోపీఆర్డీ కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ.. సమష్టిగా గ్రామాల ప్రగతికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పాలనా విధానాలపై ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకోవాలని వారు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

అనుమతులు లేని బాణసంచా తయారీ నేరం

గండేపల్లి: అనుమతులు లేని బాణసంచా తయారీ నేరం, ప్రమాదకరం అని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు అన్నారు. మంగళవారం రాత్రి జగ్గంపేట, గండేపల్లి శివారు పుష్కరకాలువ గట్టుపక్కన ఉన్న తయారీ కేంద్రాలను డీఎస్పీ, సీఐ, ఎస్సైలు పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాలు 17 ఉన్నాయన్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సైలు శివనాగబాబు, రఘునాథరావు, అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలూ.. భద్రం

న్యూస్‌టుడే – తుని, తుని పట్టణం

✦ కొన్నేళ్ల కిందట పట్టణంలో బాడవ తోట రిజర్వాయర్ సమీపంలో రాత్రి వేళ ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలోని 3 తులాల పుస్తెలతాడును దుండగులు లాక్కొని పారిపోయారు.

✦ కొంతకాలం కిందట పట్టణంలో ఎన్‌హెచ్ కొత్తూరు సెంటర్ వద్ద ఆటో కోసం నిరీక్షిస్తున్న మహిళ మెడలోని ఆభరణాలను చోరులు లాక్కొని పరారయ్యారు.

✦ తాజాగా సోమవారం పట్టపగలు బైక్‌పై వచ్చిన దుండగులు 40 గ్రాముల ఆభరణాలు లాక్కెళ్లిపోయారు.

ప్రతిఘటించలేని వారే లక్ష్యం..

తాము దాడిచేసినా ప్రతిఘటించలేని వారినే దుండగులు లక్ష్యంగా చేసుకుని స్నాచింగ్‌కు పాల్పడుతుంటారు. రోడ్లపై ఒంటరిగా రాకపోకలు సాగిస్తున్న మహిళలను గమనించి, వారిని లక్ష్యంగా పెట్టుకుని వారి వ్యవహార శైలి, చుట్టుపక్కల పరిసరాలను క్షుణ్ణంగా గమనిస్తున్నారు. చోరీ చేశాక దుండగులు పారిపోవడానికి ఏ మార్గాలు సునాయాశంగా ఉంటాయని కూడా ముందుగానే రెక్కీ వేసుకుంటున్నారు. దీనికి అనుగుణంగా తమ ప్రణాళికను అమలు చేసి చోరీ చేసి పరారవుతున్నారు. తునిలో తాజాగా జరిగిన చోరీలో బాధితురాలు రెండు చేతుల్లోనూ సామాన్లు పట్టుకుని ఉండగా, ఓ దుండగుడు ఆమెకు ఎదురుగా సెల్‌ఫోన్ చూసుకుంటూ వచ్చాడు. మరొకరు తన మిత్రుడి బైక్‌పై వెంబడిస్తూ సిద్ధంగా ఉండగా మెడలో నుంచి బంగారు ఆభరణాలు లాగగానే ద్విచక్ర వాహనం ఎక్కి, వేగంగా పరారయ్యారు.

● లిప్తక్షణంలో ఆభరణాల చోరీ

యువకులే చోరీలకు పాల్పడుతున్నారు

బాగా బైక్ నడపడం వచ్చిన, మరుసుగా పరిగెత్తగల యువకులే ఎక్కువగా ఈ చోరీలకు పాల్పడుతున్నారు. తాజా చైన్ స్నాచింగ్‌లోను 25 ఏళ్ల వయసున్న ఇద్దరు యువకులే పాల్పడ్డారు. ఎవరికీ అనుమానం రాకుండా తాము ఏదో ఊరికి వెళుతున్నట్లు, లేక కాలేజీ విద్యార్థులమని నమ్మించేలా భుజాన బ్యాగు కూడా ధరించారు. చెడు అలవాట్లకు బానిసైన, కుటుంబాలకు దూరంగా ఉంటున్న కొందరు సులువుగా డబ్బు సంపాదించి తమ అవసరాలు తీర్చుకునేందుకు ఇలా తప్పుదోవ పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కొందరు ఇలా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడితే మరి కొందరు ఇళ్లు, బ్యాంకుల నుంచి డబ్బులు, బంగారం పట్టుకున్న, పార్కింగ్ చేసిన బైకులు చోరీ చేయడం, గంజాయి రవాణా ఇతర వాటికి అలవాటు పడిపోయారు. దీనిపై ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పరిశీలిస్తూ అన్నికోణాల్లోను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



తుని పట్టణ ప్రాంతం

విద్యాదాత వెంకట రామశేషగిరిరావుకు నివాళి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఏర్పాటుకు 14.5 ఎకరాల స్థలం దానం చేసి విద్యాభివృద్ధికి కృషిచేసిన విద్యాదాత కొక్కొండ వెంకట రామశేషగిరిరావు పంతులు 58వ వర్ధంతిని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి కమిటీ పూర్వఛైర్మన్ ఎస్‌వీఎస్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. డాలి గోవిందు, పాఠశాల హెచ్ఎం యుఎస్ఎన్ సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్‌వీఎస్ రామ్‌కుమార్, తదితరులు

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి తహసీల్దారుగా ఎస్.పోతురాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శంఖవరం తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదుపై సిబ్బందికి సూచనలు చేశారు.



ఎస్.పోతురాజు

ధనసత్తెమ్మకు బోనాలు సమర్పణ

గండేపల్లి(జగ్గంపేట): జగ్గంపేటలోని ధనసత్తెమ్మ అమ్మవారికి మంగళవారం మహిళలు బోనాలు సమర్పించారు. శెట్టిబలిజపేటలో దేవీ నవరాత్రులు సందర్భంగా ప్రత్యేక మండపంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఆలయం వద్ద నుంచి ధనసత్తెమ్మ ఆలయం వరకు పంట పొలాలు మధ్య మహిళలు నడుచుకుంటూ వెళ్లి బోనాలు సమర్పించారు. కమిటీ సభ్యులు కొండబాబు, ముత్యాలు, గురయ్యా, వీరబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకువెళ్తున్న భక్తులు

సెలవులకు ఊరెళ్తున్నారా.. వస్తువులు జాగ్రత్త!

గండేపల్లి, న్యూస్‌టుడే: దశమి సెలవుల్లో ఊరువెళ్తే మీ ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని గండేపల్లి ఎస్సై శివనాగబాబు అన్నారు. ఊరు వెళ్లే ప్రతీ ఒక్కరూ మీ విలువైన బంగారం, వెండి, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని, ఊరు వెళ్తున్న సమాచారం సోషల్ మీడియాలో పంచుకోరాదని, వాహనాలను జాగ్రత్తగా ఇళ్లల్లో భద్రపరుచుకోవాలని అన్నారు.



ప్రత్తిపాడులో ఎమ్మెల్యేని కలిసిన ఆర్టీసీ కార్మిక ఐకాస నాయకులు

కార్మికులకు న్యాయం చేయాలని వినతి

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తుని పట్టణం, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యప్రభని మంగళవారం ఏలేశ్వరం ఆర్టీసీ ఐకాస కార్మికులు కలుసుకున్నారు. ఏ విధమైన అవకతవకలకు పాల్పడకుండా బాధ్యతలు నిర్వహించే కండక్టర్ ఎస్.శ్రీనివాసరావుని అకారణంగా డిపో మేనేజర్ సస్పెండ్ చేశారని ఎమ్మెల్యేకి ఈ సందర్భంగా నాయకులు యూబీఎం కుమార్, కె.త్రిమూర్తులు, నానాజీ, చలం తదితరులు వివరించారు. కండక్టర్‌ని తిరిగి విధుల్లో తీసుకునేలా ప్రయత్నం చేయాలని వారు కోరారు. ఏలేశ్వరంలో రిలే నిరాహార దీక్షల్లో పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిపో మెయిన్ గేట్ వద్ద నాయకులు, కార్మికులు ధర్నా చేశారు. ● తుని డిపో కండక్టర్లపై అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాయకులు ఎం.వి.ఆర్. మూర్తి, సాయిరాం, ఎం.వి.ఎస్ నారాయణ, కె.ఎస్.ఎన్. రాజులు పాల్గొన్నారు.

బురదనీటిని తాగేదెలా..?

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కాండ్రేగులలో కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితమై బురదనీరు వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇంటింటికీ సరఫరా అయ్యే జల్‌జీవన్‌మిషన్ పథకం నీరు కలుషితమై రావడంతో తాగలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోడ్డుపక్కన అమర్చిన ట్యాంకుల వద్ద నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు తెలిపారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా అందించాలని కోరుతున్నారు.



కాండ్రేగులలో కొళాయిల ద్వారా వస్తున్న బురదనీరు

గరువు..చెరువులా..

నీటి ఎద్దడిని ఎదుర్కొనే గ్రామాల్లో ముందు వరుసలో మండలంలోని శరభవరం ఉంటుంది. వేసవికి మూడు నెలల ముందే చెరువులు గరువులవుతాయి. పశువుల గొంతు తడపాలన్నా బోర్ల వద్దకెళ్లాలి. చెరువు చుట్టూ బోర్లు కొట్టిన పరిస్థితి ఇక్కడ ఉంది. ఈ ఏడాది వర్షాలతో ఊరి మధ్య చెరువు, గ్రామ శివారున ఉన్న నీటివనరు నిండుకుండలయ్యాయి. మైదానాల్లా మారిన కాసారాల్లో నీటి పంట పండింది. ఈ చెరువుల్లో నీరు ఉంటే శరభవరంలో భూగర్భ జలాలు అందుబాటులో ఉంటాయి. బోర్లు, బావులు నీటిని నిరంతరాయంగా అందిస్తాయి.

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



జూన్‌లో శరభవరం చెరువు



నేడు జలకళ..

దివ్యాంగులకు సామగ్రి పంపిణీ నేడు

తుని: అలిమ్‌కో సంస్థ ద్వారా దివ్యాంగులకు వివిధ రకాల ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని రాజా క్రీడామైదానంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే యనమల దివ్య వీటిని దివ్యాంగులకు పంపిణీ చేయనున్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం

తుని, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి బృంద యోగా పోటీల్లో తమ విద్యార్థులు బంగారు పతకం సాధించారని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. బాలుర అండర్ -17 విభాగంలో జీఎస్ఎస్ చరణ్, పి.సోహన్‌శ్రీ, బి.దేవాన్ష్ నాయుడు, సీహెచ్ జయదీప్, వి.చైతన్య ప్రథమ స్థానంలో నిలిచి పతకం కైవశం చేసుకున్నారన్నారు. ఈ పోటీల్లో వివిధ జోన్ల నుంచి 18 జట్లు పాల్గొనగా తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. విజేతలను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వికె నరసింహారావు, యోగా గురువులు డి.సురేష్, జయంతి తదితరులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న నరసింహారావు



రాస్తారోకోలో వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, కార్యకర్తలు

'ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తాం'

ఏలేశ్వరం: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మాల సోదరులు ఏలేశ్వరంలో కదం తొక్కారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పట్టణం, గ్రామీణ మండలంలోని అన్ని పల్లెల్లో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఏలేశ్వరం బాలాజీ చౌక్ కూడలిలో రాస్తారోకో చేసి ప్రభుత్వం అన్ని వర్గాలను సమదృష్టితో చూడాలన్నారు. నాయకులు కుప్పల నాగభూషణం, కోనాల వెంకటరమణ, వసంత యోహాన్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీలను విడదీస్తే మాలలు తీవ్రంగా నష్టపోతారని, సుప్రీంకోర్టు తన తీర్పును పునః సమీక్షించాలన్నారు.

నేటితో ఈ-పంట నమోదు గడువు పూర్తి

గండేపల్లి, న్యూస్‌టుడే: నేటితో ఈ పంట నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందని, ప్రతీ రైతు ఈ పంటను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. మంగళవారం గండేపల్లి మండలం కె.గోపాలపురం, ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు 95 శాతం పూర్తయ్యిందని అన్నారు. ఉద్యానశాఖ అధికారిణి లావణ్య, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొంతంగిలో 'పొలం పిలుస్తుంది'

శంఖవరం: కొంతంగి గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. రాయితీపై అందుబాటులో ఉన్న వ్యవసాయ పనిముట్లను వినియోగించుకోవాలన్నారు.

పాడిరైతులకు ప్రభుత్వ రాయితీలు

తుని గ్రామీణం: పాడిరైతులకు కూటమి ప్రభుత్వం సమకూర్చిన రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాంప్రసాద్ సూచించారు. ఉపాధి హామీ నిధులతో పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.లక్షలు రాయితీలు అందజేస్తున్నట్లు తెలిపారు. పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఈక్రాప్‌లో పంటను నమోదు చేయించుకోవాలన్నారు.

సమీకృత వ్యవసాయంతో అధిక ఆదాయం

ప్రత్తిపాడు: సమీకృత వ్యవసాయంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి ఇంటి వీర గంగాధర్ తెలిపారు. ధర్మవరం రైతు సేవాకేంద్రాల్లో 'పొలం పిలుస్తోంది' మంగళవారం నిర్వహించారు. తక్కువ ఆదాయం వచ్చే పంటలకు బదులు ఎకరాకు ఏడాదికి రూ.1.5లక్షల ఆదాయం వచ్చేలా సమీకృత సాగు చేసే పద్ధతులను వివరించారు. పశువైద్యాధికారి వరలక్ష్మి పాడిపశువుల పోషణ, సీజనల్ వ్యాధుల నుంచి వాటిని కాపాడుకోవడంపై అవగాహన కలిగించారు.

భాజపా శ్రేణుల సంబరాలు

ప్రత్తిపాడు: హరియాణాలో భాజపా విజయం సాధించడంపై ప్రత్తిపాడులో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సంబరాలు చేశారు. భాజపా సీనియర్ నేత సింగిలిదేవి సత్తిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లా శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు మిఠాయిలు పంచారు.

డొక్కా సీతమ్మ సేవలు ఆదర్శం

గండేపల్లి(జగ్గంపేట): డొక్కా సీతమ్మ సేవలను ఆదర్శంగా తీసుకుని పేదలకు అన్నం పెట్టడం జరుగుతుందని జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. ఈ వారం రామవరానికి చెందిన మండపాక బాపన్నదొర సాయంతో భోజనాలు పెట్టారు.



భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్

ట్రాక్టర్ బోల్తా

గండేపల్లి: ఎన్‌హెచ్‌పై మంగళవారం రాత్రి తాడిబద్దల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైన్‌లో పడి బోల్తాకొట్టింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సోపెల్లాకి చెందిన బి.లోవరాజు కత్తిపూడి నుంచి రాజమహేంద్రవరం వైపు ట్రాక్టర్‌పై తాటిలోడు తీసుకెళ్తున్నారు. జడ్.రాగంపేట సమీపంలో వాహనాన్ని నిలిపారు. ఆపినచోట డ్రైన్ కిందకు దిగడంతో ట్రాక్టర్ బోల్తాకొట్టింది. డ్రైవర్ సురక్షితంగా తప్పించుకున్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపు.. ముగ్గురిపై కేసు

శంఖవరం: చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను మంగళవారం అదుపులోకి తీసుకున్నామని అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు. రెండు వాహనాల్లో తుని వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వాహనాలను అన్నవరం ఎన్‌హెచ్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. చేపల చెరువుల మేతకు తరలిస్తున్నారన్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. వాహనాల్లో ఉన్న చికెన్ వ్యర్థాలను నిర్మానుష్యప్రదేశంలో పాతిపెట్టామన్నారు. ఎవరైనా ఇలాంటి తరలింపులకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో సారా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట గ్రామీణం,ప్రత్తిపాడు: కాట్రావులపల్లిలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి పది లీటర్ల సరకును పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

● ప్రత్తిపాడు మండలంలో 60 లీటర్ల సారాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్దిపాలెం గ్రామానికి చెందిన బర్ల ఆదివిష్ణు, పెదశంకర్లపూడిలో గంగాధర్‌ను అరెస్టు చేశామని చెప్పారు.

పల్లెదారులు.. వ్యర్థాలమయం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా పేరుతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా ఆచరణలో ఆమడదూరంలో నిలిచిపోతున్నాయి. రహదారుల పక్కన, కాలువగట్లు, ఖాళీప్రదేశాల్లో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. చెత్తను వేసేందుకు నిర్మించిన సంపదకేంద్రాలు నిర్వహణలేక నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించి పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా అమలుచేయాలని పలువురు కోరుతున్నారు.

● మండలంలోని గొల్లలగుంట శివారు స్మశాన వాటిక వద్ద ర.భ రోడ్డుపై చెత్త వేయడంతో రోజురోజుకూ పేరుకుపోయి పెద్దకుప్పగా ఏర్పడింది.

● మల్లిపాకలో చెత్తనిర్వహణ సక్రమంగా లేక రోడ్లపక్కనే వేస్తున్నారు. గ్రామం నుంచి ఇర్రిపాక, గొల్లలగుంట వెళ్లే మార్గాల్లో ఉన్న రోడ్లపై చెత్తవేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



మల్లిపాకలో రోడ్డుపై చెత్త

● రామవరంలో సగరపేటలో కాలనీలో చెత్తవేసేందుకు చోటులేకపోవడంతో సమీపంలో ఉన్న ఎన్‌హెచ్ రహదారిపై వేస్తున్నారు. రాజపూడిలో పుష్కర కాలువ వెంబడి చెత్తను డంప్ చేస్తున్నారు.

● మండలంలోని కాండ్రేగుల, జె.కొత్తూరు, మన్యంవారిపాలెం, తదితర గ్రామాల్లో రోడ్లపై చెత్తవేయడంతో గ్రామ ముఖద్వారం చెత్తతోనే స్వాగతం పలుకుతుంది.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో సేకరించిన చెత్తను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకుంటాం. ఆయా గ్రామ కార్యదర్శులతో మాట్లాడి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

- ఎం.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి, ఈవోపీఆర్డీ